మంచిమాట
కోపం వచ్చినప్పుడు
నీ మనసుతో పోరాడు
మనిషితో కాదు..
సమస్య వచ్చినప్పుడు
కాలంతో పోరాడు
కన్నీరుతో కాదు..

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250

Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, Rajahmundry, Kakinada, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

RNI No.52722/90 సంపుటి : 38 సంచిక : 148 విశాఖపట్నం, 18 మార్చి 2026 బుధవారం E-mail : vspnews@gmail.com పేజీలు : 8 వెల : రూ.2.00


## రాష్ట్రంలో 14 వేల టన్నుల ఎల్పీజీ నిల్వలు: సీఎం చంద్రబాబు



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 17 :** రాష్ట్రంలో ప్రస్తుతం 14వేల టన్నుల ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. మరికొన్ని టన్నుల గ్యాస్ త్వరలోనే అందుబాటులోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో ఎల్పీజీ సరఫరాకు ఇబ్బందుల్లేవని, ఆస్పత్రులు, హాస్టళ్లు, ఆలయాలకు కొరత రాకుండా చూడాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. గ్యాస్ సరఫరా అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు ఉన్నట్లు చెప్పారు. ఈ కేవైసీ, ఓటీపీల ద్వారా సిలిండర్ల డైవర్షన్ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్ లభ్యత పెరిగేలా చూడాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఉత్పత్తి పెంపు, మెరుగైన పంపిణీ జరిగేలా చూడాలని సమీక్షకు హాజరైన సీఎస్ సాయిప్రసాద్, పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు, గెయిల్, ఓఎన్జీసీ ప్రతినిధులకు సూచించారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాలని.. కేజీ బేసిన్ గ్యాస్‌ను పైప్డ్ నెట్‌వర్క్ ద్వారా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. సీఎన్జీ, పీఎన్జీల వినియోగం గరిష్ఠంగా పెంచాలని పేర్కొన్నారు.

## ఉద్యోగాల కల్పనే సింగిల్ ఎజెండాగా ఉండాలి: మంత్రి లోకేశ్



**మంగళగిరి, విశాఖ సమాచారమ్, మార్చి 17 :** రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే మన ఏకైక లక్ష్యం కావాలని మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరి సమీపంలోని చినకాకానిలో మయూరి టెక్ పార్క్ భవనంలో ఏర్పాటుచేసిన ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు నూతన కార్యా లయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడి ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. గత ప్రభుత్వం ఏపీఈడీబీని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం 20 నెలల కాలంలోనే పెద్దఎత్తున పెట్టుబడులు సాధించిందని లోకేశ్ అన్నారు. దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయని చెప్పారు. గూగుల్, ఆర్సెలార్ మిత్తల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీని ఎంచుకున్నా యన్నారు. ఇప్పుడు వేగాన్ని మరింత పెంచాల్సిన అవసరముందని చెప్పారు. ఉద్యోగాల కల్పనే సింగిల్ ఎజెండాగా ⏭ తరువాయి 2లో..

## రాయలసీమలో సెగ.. కోస్తాలో తగ్గిన ఉష్ణోగ్రతలు

- హుకుంపేటలో కురిసిన వడగళ్లు



**విశాఖపట్నం, విశాఖ సమాచారమ్, మార్చి 17 :** రాష్ట్రంలో భిన్న వాతావరణం నెలకొంది. రాయలసీమ జిల్లాల్లో సోమవారం భానుడు నిప్పులు కురిపించాడు. రాష్ట్రంలోనే అత్యధికంగా అనంతపురంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 38.6 డిగ్రీలుగా నమోదైంది. కోస్తా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు కొంత తగ్గుముఖం పట్టాయి. రాబోయే నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. పిడుగులతో పాటు గంటకు గరిష్ఠంగా 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అంచనా వేస్తోంది. మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడొచ్చని తెలిపింది.

**మన్యంలో వడగళ్ల వాన**

**హుకుంపేట :** వాతావరణ అనిశ్చితి ప్రభావంతో అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేటలో సోమవారం ఈదురుగాలులు, వడగళ్లతో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండ కాసి.. ఒక్కసారిగా కుండపోత వాన పడింది. వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. శ్రీకాకుళం జిల్లాలోనూ కొన్నిచోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి.

## మహోన్నత సేవా పతకానికి సీఎం స్పెషల్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎంపిక



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 17 :** ముఖ్యమంత్రి భద్రతా విభాగం స్పెషల్ సెక్యూరిటీ ఆఫీసర్ కె. మధుసూధన్ మహోన్నత సేవా పతకానికి ఎంపికయ్యారు. సమర్థంగా విధులు నిర్వర్తిస్తున్నందుకు గానూ ఆయనకు ఈ పతకం లభించింది. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వారికి ఉగాది రోజున పతకాలు ప్రదానం చేయనున్నారు. 1996లో ఎస్సైగా పోలీసు విధుల్లో చేరిన మధుసూధన్ నేడు డీఎస్పీగా పని చేస్తున్నారు. 2019 నుంచి చంద్రబాబుకు సీఎస్ఓగా విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్వాయ్ డ్రైవర్ ఏవీఎస్ గిరిబాబు కూడా ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు. 1990లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన గిరిబాబు.. ప్రస్తుతం ఏఆర్ ఎస్సైగా ఉన్నారు. గత 15 ఏళ్లుగా చంద్రబాబు కాన్వాయ్ వాహన డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.




# 'ఎల్పీజీ స్కామ్': ఒక్క క్లిక్‌తో మీ ఖాతా ఖాళీ



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో దేశవ్యాపంగా గ్యాస్ సిలిండర్ల సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సరిగ్గా ఇదే అదనుగా భావించిన సైబర్ నేరగాళ్లు కొత్త రకం 'ఎల్పీజీ స్కామ్'తో అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారు. వీరు సృష్టిస్తున్న మోసపూరిత లింకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఢిల్లీ పోలీసులు ప్రజలకు అత్యవసర హెచ్చరికలు జారీ చేశారు.

**ఏమిటీ గ్యాస్ స్కామ్?**

ఢిల్లీ నగరంలో ఎల్పీజీ కొరత నెలకొనడంతో, వినియోగదారుల మొబైల్ ఫోన్లకు నిరంతరం ఎస్ఎంఎస్ , వాట్సాప్ సందేశాలు వస్తున్నాయి. 'మీ ఎల్పీజీ కేవైసీ పెండింగ్‌లో ఉంది', 'స్టాక్ పరిమితంగా ఉంది, వెంటనే బుక్ చేసుకోండి', 'ఆధార్ లింక్ చేయకపోతే కనెక్షన్ కట్ అవుతుంది' అంటూ భయపెట్టిస్తూ కేటుగాళ్లు లింకులు పంపుతున్నారు.

**పోలీసులు గుర్తించిన మోసాలివే:**

నకిలీ వెబ్‌సైట్లు: Indane, HP వంటి ప్రముఖ గ్యాస్ కంపెనీల పేర్లను పోలి ఉండేలా bookLPGfast.com, 'lpg-booking.com' వంటి వెబ్‌సైట్లను సృష్టించి అడ్వాన్స్ పేమెంట్లు వసూలు చేస్తున్నారు.

డేంజరస్ ఏపీకే (APK) ఫైల్స్: వాట్సాప్ ద్వారా గ్యాస్ బుకింగ్ యాప్స్ అంటూ ఏపీకే ఫైల్స్ పంపిస్తున్నారు. వీటిని ఇన్‌స్టాల్ చేస్తే ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు నేరుగా హ్యాకర్ల చేతికి వెళ్తాయి. ఓటీపీ మోసాలు: తక్కువ ధరకే సిలిండర్ ఇప్పిస్తామంటూ ఫోన్ చేసి, మీ ఫోన్‌కు వచ్చే ఓటీపీ లేదా పిన్ నంబర్లను అడిగి తెలుసుకుని ఖాతాలు ఖాళీ చేస్తున్నారు.

**జాగ్రత్తగా ఉండండి ఇలా..**

'గ్యాస్ బుకింగ్ కోసం అనధికారిక లింకులను క్లిక్ చేయవద్దు. కేవలం గ్యాస్ ఏజెన్సీల అధికారిక వెబ్‌సైట్లు లేదా మొబైల్ యాప్స్ ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలి' అని ఢిల్లీ డీసీపీ ఆశిష్ మిశ్రా సూచించారు. ఎవరైనా ఇలాంటి మోసానికి గురైతే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు కాల్ చేయాలని లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన పేర్కొన్నారు.

# త్వరలోనే విజయ్‌తో పెళ్లి.. ఇలా హింట్ ఇచ్చిన త్రిష తల్లి!



**చెన్నై :** టీవీకే పార్టీని స్థాపించి, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న విజయ్‌కి ఆయన సతీమణి సంగీత భారీ షాకిచ్చిన సంగతి తెలిసిందే. విజయ్‌తో విడాకులు ఇప్పించాలంటూ ఆమె కోర్టు మెట్లు ఎక్కడం.. ఒక నటితో ఆయన సహజీవనం చేస్తున్నాడని ఆరోపించడంతో త్రిష పేరు బయటకు వచ్చింది. విజయ్ సహజీవనం చేస్తున్నది త్రిషతోనే అని తమిళ మీడియా కోడై కూసింది. అది నిజమే అన్నట్లుగా త్రిష, విజయ్ కలిసి ఓ వివాహ వేడుకకు హాజరై, తమ బంధాన్ని బహిరంగం చేశారు.

అప్పటి నుంచి విజయ్, త్రిషల పెళ్లిపై నెట్టింట పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికలు పూర్తవ్వగానే పెళ్లి చేసుకుంటారనే వార్తలు వినిపిస్తున్నాయి.అయితే ఇదంతా పుకార్లే అని అంతా భావిస్తున్న తరుణంలో త్రిష తల్లి చేసిన ఓ పని.. మరోసారి వీరిద్దరి పెళ్లిపై చర్చకు దారి తీసింది.

**అలా హింట్ ఇచ్చిందా?**

త్రిష,విజయ్ కలిసి ఓ వివాహ వేడుకకు హాజరైనప్పటి నుంచి వీరిద్దరి పెళ్లిపై నెట్టింట రకరకాల వార్తలు పుట్టుకొచ్చాయి. కొంతమంది అయితే ఏఐని ఉపయోగించి పెళ్లి వీడియో క్రియేట్ చేసి..సోషల్ మీడియాలో వదిలారు. ఆ వీడియోలు బాగా వైరల్ అయ్యాయి. అలా విజయ్ అభిమాని ఒకరు ఏఐ టెక్నాలజీతో విజయ్, త్రిషల పెళ్లికి సినీ, రాజకీయ ప్రముఖులంతా హాజరైనట్లు వీడియో క్రియేట్ చేశాడు. అది నెట్టింట తెగ వైరల్ అయింది. ఆ వీడియోకి త్రిష తల్లి ఉమా కృష్ణన్ లైక్ కొట్టారు. దీంతో విజయ్‌తో పెళ్లికి త్రిష తల్లి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందంటూ..ఆమె లైక్ కొట్టిన పోస్ట్‌ని వైరల్ చేస్తున్నారు.

**ఎన్నికల తర్వాత పెళ్లి**

విజయ్ ప్రస్తుతం తన ఫోకస్ అంతా తమిళనాడు ఎన్నికలపైనే పెట్టాడు. పొత్తుకు బీజేపీ ఆసక్తి చూపుతున్నా.. ఈ సారి ఒంటరిగానే బరిలోకి దిగాలని ప్రయత్నిస్తున్నాడు. ఈ ఎన్నికలు పూర్తయిన తర్వాత త్రిషను అధికారికంగా పెళ్లి చేసుకోవాలని భావిస్తున్నాడట. ఇప్పటికే ఈ విషయంపై ఇరు కుటుంబాలలో చర్చలు కూడా జరిగాయట. ఇక సంగీత విషయానికొస్తే.. ఓ అభిమానిగా పరిచయం అయితే ఈమెను.. విజయ్ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. 1999లో వీరిద్ద వివాహం జరిగింది. ఈ జంటకు ఇద్దరు పిల్లలు. అయితే గత కొంతకాలంగా విజయ్, సంగీత వేరు వేరుగా ఉంటున్నారు.

# నాలుగు పశ్చిమాసియా దేశాలకు మానవతా సాయం అందిస్తాం

**బీజింగ్ :** ఇరాన్, లెబనాన్ సహా నాలుగు పశ్చిమాసియా దేశాలకు మానవతా సాయం అందించనున్నట్లు చైనా మంగళవారం ప్రకటించింది. ఇరాన్, లెబనాన్ లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయిల్ చేపడుతున్న దాడులు మూడో వారానికి చేరుకున్న సంగతి తెలిసిందే. పశ్చిమాసియాలో సైనిక కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ ఇరువర్గాలకు సూచించారు. ఇరాన్, పశ్చిమదేశాలపై యుద్ధం "తీవ్రమైన మానవ విపత్తు"కి దారితీస్తుందని అన్నారు. ఈ పరిస్థితుల్లో పశ్చిమాసియా దేశాలైన ఇరాన్, జోర్డాన్, లెబనాన్ మరియు ఇరాక్‌లకు అత్యవసర మానవతా సాయం అందించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. దీంతో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న మానవతా సంక్షోభాన్ని కొంతవరకు తగ్గించవచ్చని ఆశిస్తున్నామని లీన్ మీడియాకు వెల్లడించారు.

# బెంగాల్లో తృణమూల్, బీజేపీ నువ్వా నేనా?




**పశ్చిమ బెంగాల్ :** పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల పోరు మరోసారి దేశమంతటి దృష్టినీ ఆకర్షిస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం పరిస్థితులు ఒకరకంగా చెప్పాలంటే 'సర్'కు ముందు, తర్వాత అన్నట్టుగా పరిణమించాయి. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియకు ముందు వరకూ సీఎం మమతా బెనర్జీయే రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా వెలుగొందారు. కానీ ఓటర్ల జాబితా సవరణతో అధికార తృణమూల్ పార్టీ ఓటు బ్యాంకు భారీగా ప్రభావితమైనట్టు కన్పిస్తోంది. దాంతో ఈ ఎన్నికల్లో 'సర్'ప్రక్రియనే ప్రధాన ప్రచారాంశంగా చేసుకోవాలని దీదీ నిర్ణయించారు! 'సర్'సాకుతో బెంగాలీల అస్తిత్వంపైనే దెబ్బ కొట్టేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారంటూ దుయ్యబడుతున్నారు. దాంతో సర్ ప్రక్రియ బెంగాల్ రాజకీయ ముఖచిత్రాన్నే మార్చేసేలా కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో ఇతర అంశాలు, సమస్యలు ఎన్నున్నా ఈసారి కూడా రాష్ట్రంలో ఎన్నికలు మరోసారి 'మమత వర్సెస్ మోదీ'అన్నట్టుగానే జరగనున్నాయి.

ఇద్దరు పాపులర్ నేతల పోరులో అంతిమంగా పైచేయి సాధించేది ఎవరన్నది ఆసక్తికరంగా మారింది. బీజేపీ దూకుడుకు మరోసారి ముకుతాడేసి వరుసగా నాలుగోసారి విజయఢంకా మోగించాలని తృణమూల్ ప్రయత్నిస్తోంది. ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర వ్యతిరేకత, శాంతిభద్రతల సమస్యలు, పలు రంగాల్లో మమత సర్కారు వైఫల్యాలు తదితరాలను అస్త్రాలుగా మార్చుకోవాలని బీజేపీ భావిస్తోంది. 2021 ఎన్నికల్లో తృణమూల్‌కు గట్టి పోటీ ఇచ్చి 77 సీట్లు కైవసం చేసుకున్న ఆ పార్టీ, ఈసారి గ్రామీణ ప్రాంతాల్లో మరింతగా చొచ్చుకుపోయి బెంగాల్‌పై తొలిసారిగా కాషాయ జెండా ఎగరేయాలని పట్టుదలతో ఉంది. గత ఎన్నికల్లో సున్నా చుట్టి పూర్తిగా చతికిలపడ్డ లెఫ్ట్ ఫ్రంట్, కాంగ్రెస్ ఈసారి ఎలాగైనా గట్టిగా ఉనికిని చాటుకునే ప్రయత్నాల్లో పడ్డాయి.

పశ్చిమబెంగాల్‌లో ఈసారి అసెంబ్లీ ఎన్నికలను అధికార బీజేపీ, విపక్ష తృణమూల్ కాంగ్రెస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. మమత దూకుడుకు ముకుతాడేసి ఈసారి రాష్ట్రంలో ఎలాగైనా విజయఢంకా మోగించాలని బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి బెంగాల్‌పై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించారు. త్వరలో వారిద్దరూ రాష్ట్రంలో సుడిగాలి ప్రచారానికి తెర తీయనున్నారు. మోదీ కరిష్మా రాష్ట్రంలో ఈసారి అధికారం కట్టబెట్టడం ఖాయమని బీజేపీ విశ్వసిస్తోంది. 15 ఏళ్లుగా సాగుతున్న తృణమూల్ పాలనపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర వ్యతిరేకత బాగా కలిసొచ్చే అంశమన్నది ఆ పార్టీ భావన. రాష్ట్రంలో శాంతిభద్రతలు దారుణంగా క్షీణించాయన్న ప్రచారం కూడా తృణమూల్‌కు గట్టిగానే చేటుచేసేలా కన్పిస్తోంది.

# ఇజ్రాయెల్ ప్రకటన
# ఇరాన్‌కు మరో ఎదురుదెబ్బ?!




**ఇజ్రాయిల్ :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా గత 18 రోజులుగా ఇరాన్ పోరాడుతోంది. తాజాగా ఇజ్రాయెల్ జరిపిన తాజా వైమానిక దాడిలో ఇరాన్ భద్రతా విభాగం అధిపతి అలీ లారిజానీ మరణించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. జాతీయ భద్రతా మండలి కార్యదర్శి అలీ లారిజానీ, టెహ్రాన్ బసిజ్ పారామిలిటరీ దళాల కమాండర్ సోలేమానీ హతమయ్యారని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ మంగళవారం తెలిపారు.

**కీలక నేత అలీ లారిజానీ మృతి**

ఇరాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడులలో ఇరాన్ భద్రతా అధిపతి అలీ లారిజానీ చనిపోయారని ఇజ్రాయెల్ మీడియా తెలిపింది.. ఈ దాడుల్లో బాసిజ్ రెసిస్టెన్స్ ఫోర్స్ అధిపతి సులేమానీ లక్ష్యంగా ఈదాడి జరిగిందని వెల్లడించాయి.అయితే లారిజాని ఈ దాడిలో మరణించారా లేదా గాయపడ్డారా అనేది ఇంకా స్పష్టంగా తెలియదని టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ తెలిపింది.

**ఇంకా స్పందించని ఇరాన్**

ఈ నివేదికలపై ఇరాన్ ఇంకా స్పందించలేదు. లారిజానిని ఇరాన్ అధికార వ్యవస్థలో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులలో ఒకరిగా భావిస్తారు. ఈ వార్త నిజమైతే, సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ తర్వాత ఇరాన్‌లో మరణించిన అత్యంత కీలకమైన వ్యక్తి లారిజానీ. లారిజానీ గతంలో అణు చర్చల ప్రతినిధిగా కూడా పనిచేశారు.

మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను విమర్శిస్తూ, ఇరాన్ ప్రజల పోరాటం కొనసాగుతుందని తమ పోరాటంలో టెహ్రాన్ "దృఢంగా" ఉంటుందని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి లారిజాని ముస్లిం ఐక్యతకు పిలుపునిచ్చిన మరునాడు ఈ వార్తలు వెలువడ్డాయి.

# జగిత్యాల జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**జగిత్యాల :** మాజీ మంత్రి జీవన్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ఏ పార్టీలో ఉన్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లో ఉన్నానని చెబుతున్న సంజయ్.. నన్ను తనతో కలిసి పనిచేయాలని ఎలా అడుగుతారంటూ ప్రశ్నలు సంధించారు. నాడు ప్రతిపక్షంలో ఉండి ఒంటిచేత్తో అధికారపార్టీతో పోరాటం చేసిన నేను మంత్రి కావాలనుకోవడం తప్పా. పార్టీ ఫిరాయింపునకు నాకు అవకాశం లేకుండేనా అని ప్రశ్నించారు.

మాజీ మంత్రి జీవన్ రెడ్డి తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. 'నాలుగు దశాబ్దాల బంధాన్ని విడిచి పెట్టుకోవడం ఎవరికైనా ఇబ్బందే. ఆ స్థితిలో నేను ఇవాళ బాధ పడుతున్నాను. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్.. ఆయన ఏ పార్టీలో ఉన్నారో తెలియదు కానీ.. నన్నే తనతో కలిసి పని చేయాలని ఆఫర్ ఇస్తున్నారు. అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పని చేయడంలో తప్పు లేదు. కానీ, కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం, హక్కులను కాల రాయడం, అభ్యర్థుల ఎంపిక చేయడం ఇవన్నీ సమంజసమా.

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నేను పార్టీలో ఎదురవుతున్న పరిణామాలపై ఆవేదన వ్యక్తం చేశాను. ఇందుకు ఎమ్మెల్యే సంజయ్ కారణం కాదా. 1995లో చంద్రబాబు సీఎం అయిన సమయంలో ఎక్కడా పోటీకి కూడా వెనుకంజ వేసిన కాలంలో జగిత్యాల నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో మేం అన్నీ గెల్చుకున్నాం. వీడిపోవడానికి కారకుడైన వ్యక్తి ఇవాళ కలిసి పని చేస్తానంటున్నాడు. నేను ఎక్కడ ఉన్నా అంకితభావంతో పనిచేస్తా. ఈ ఎమ్మెల్యే సంజయ్ ఒత్తిడితో ఓ ఆడబిడ్డ మున్సిపాలిటీలో ఇబ్బంది పడింది నిజం కాదా. నాకు ఆఫర్ ఇవ్వడానికి సంజయ్ ఎవరు. నేను పార్టీ వీడుతానని ఆయనకు చెప్పానా. పార్టీ వీడాలని కోరుకోవడం లేదని ఎలా అంటారు. అసలు సంజయ్ ఏ పార్టీలో ఉన్నారు. నన్ను ఎలా కలిసి రమ్మంటారు. సంజయ్ బీఆర్ఎస్‌లో ఉన్నారని స్పీకర్ అంటున్నారు. కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలని సంజయ్ అంటున్నారు. అసలు ఎవరు ఏ పార్టీలో ఉన్నారు' అంటూ ఘాటు విమర్శలు చేశారు.



**కాంగ్రెస్‌కు గుడ్ బై... నేను పార్టీ మారడం ఖాయం**

ఈ ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఉన్న సమస్యలు పట్టించుకోడు. చట్టసభల్లో ఎంపికైన వాళ్ళు ప్రజాస్వామ్య బద్ధంగా నడుచుకోవాలి. నేను ఇంతవరకు కూడా కాంగ్రెస్‌లోనే ఉన్నాను. ఉండాలని ఇంకా కోరుకుంటున్నా. ఇంట్లో ఉడుం లాగా వచ్చి చేరితే ఆయనతో కలిసి ఎలా పనిచేస్తాం. నిన్నటి వరకు రాష్ట్రానికి జగిత్యాల ఆదర్శంగా ఉంటే ఇవాళ వివాదాలకు కేరాఫ్ చేశాడు. రాముడు నాకు ఆదర్శం. అందుకే శ్రీరామనవమి సందర్భంగా ఫ్లెక్సీలు పెట్టుకున్నా. నేను పార్టీ మారితే దానికి కారణం ఎమ్మెల్యే సంజయ్, ఆయన వెనుకున్న వారే కారణం అవుతారు. ఈ ఎపిసోడ్‌లో కాంగ్రెస్ అధిష్టానానిదే బాధ్యత. నాకు పార్టీ మారాలనే యోచనకు కారణం ఈ ఆవేదనే' అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు.

# నటనా 'కోట'కు ఆస్కార్ నీరాజనం



**కంకిపాడు:** పద్మశ్రీ అవార్డు గ్రహీత, సినీనటుడు కోట శ్రీనివాసరావు విలక్షణ నటుడు. తన హావభావాలు, నటనతో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించి, తనకంటూ సినీ జగత్తులో కొన్ని పేజీలు ఏర్పాటు చేసుకున్నారు. నాటి నుంచి నేటి వరకూ ఆయన నటనకు మంత్ర ముగ్ధులు కాని వారు లేరంటే అతిశయోక్తికాదు. సోమవారం ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవ సభలో ఇటీవల మరణించిన భారతదేశ సినీరంగ ప్రముఖులను స్మరించుకున్న నేపథ్యంలో తెలుగు చిత్రపరిశ్రమ నుంచి కోట శ్రీనివాసరావును స్మరించటం తెలుగు చిత్ర పరిశ్రమకు దక్కిన గౌరవంగా భావించొచ్చు.

**కంకిపాడు నుంచే అన్నీ..**

గతేడాది జూలైలో కోట శ్రీనివాసరావు ఆకస్మికంగా మృతి చెందటం కళాభిమానులను కలచివేసింది. అయితే ఆస్కార్ వేదికగా దక్కిన అరుదైన గౌరవానికి ఆయన అభిమానులు సంతోషిస్తున్నారు. కోట పుట్టింది, పెరిగింది, ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించింది కంకిపాడు నుంచే. చిన్న నాటి నుంచి ఇక్కడి ప్రజలతో అవినాభావ సంబంధం ఉంది. పట్టణంలోని చిన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద స్వస్థలం ఉంది. ఇక్కడే ఆయన నివాసం కూడా ఉంది. కోట తండ్రి సీతారామాంజనేయులు లాకురోడ్డులోని గాంధీ బొమ్మ సెంటరులోని ఓ ఇంటి వద్ద వైద్యుడిగా క్లినిక్ నడిపేవారు. వైద్యుడిగా అందరికీ సుపరిచితులు. కోట శ్రీనివాసరావు ఆయన సోదరులు నరసింహారావు, శంకర్‌రావు నాటకరంగం నుంచి సినీరంగం వరకూ ఎదిగి అందరి మన్ననలు పొందటం తెలిసిందే. స్థానికంగా ఉన్న ఎలిమెంటరీ పాఠశాలలో ప్రాథమిక విద్య, ఉన్నత విద్యలను అభ్యసించిన కోట.. బ్యాంకు ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించారు. కంకిపాడు, విజయవాడ, హైదరాబాద్‌లోని ఎస్‌బీఐ బ్రాంచిల్లో ఉద్యోగిగా పనిచేస్తూ సినీరంగంలోకి అడుగుపెట్టారు. తొలి నాళ్లలో నాటకరంగంలో ప్రవేశించినా.. అంతటి ప్రాచుర్యం దక్కలేదు. అయితే సినీరంగంలో అంచెలంచెలుగా ఎదిగి, విలక్షణ నటుడిగా గుర్తింపు సాధించారు. ఆయన ప్రతిభను గుర్తించి పద్మశ్రీ అవార్డు ప్రకటించి గౌరవించారు.

**అరుదైన గౌరవం..**

కోట సీతారామంజనేయులు కుటుంబం అందరికీ సుపరిచితం. తండ్రి వైద్య రంగంలో, కుమారులు కళారంగానికి వన్నె తెచ్చారు. మా ఇంటి పక్కనే నివాసం ఉండే వారు. వీలు దొరికినప్పుడల్లా ఆ కుటుంబంతో గడిపేవాళ్లం. ఆయన మరణం చాలా బాధించింది. అయితే ఆస్కార్ వేదికగా మా కంకిపాడు వాసికి గౌరవం దక్కటం సంతోషంగా ఉంది.

**– గాదంశెట్టి పరమేశ్వరరావు, కంకిపాడు**

**సమయం చిక్కినప్పుడల్లా..**

కోట ఎంత బిజీగా ఉన్నా.. ఏ కొంత సమయం చిక్కినా కంకిపాడుకు వచ్చేవారు. ఆయన స్వస్థలంలో ఉన్న నివాసానికి వచ్చి గ్రామస్తులతో ఇష్టాగోష్టి జరిపేవారు. సినీ అభిమానులు ఆయన్ను కలుసుకుని ఆశీర్వాదం పొందేవారు. కళారంగానికి సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొంటూ కళాభిమానుల్ని ప్రోత్సహించేవారు.

# ఉద్యోగాల కల్పనే సింగిల్ ఎజెండాగా ఉండాలి: మంత్రి లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

ఉండాలని మంత్రి సూచించారు. నూతన పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్న ప్రాజెక్టుల గ్రౌండింగ్ మన ప్రధాన లక్ష్యం కావాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సీనియర్ ఐఏఎస్ అధికారి ఎంటీ కృష్ణబాబు, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఏపీఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, ఏపీఐఐసీ వైస్ ఛైర్మన్, ఎండీ అభిషిక్త్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# హెరిటేజ్‌కి చంద్రబాబు ప్రభుత్వం భారీ రాయితీలు




**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 17 :** హెరిటేజ్‌కి చంద్రబాబు ప్రభుత్వం భారీ రాయితీలు కల్పించింది. టైలర్ మేడ్ రాయితీలిస్తూ జీవో 57ను ప్రభుత్వం జారీ చేసింది. హెరిటేజ్ కంపెనీకి మొత్తం రూ.59.69 కోట్లు రాయతీలిస్తున్నట్లు జీవోలో పేర్కొంది.

35మందికి ఉద్యోగాలిస్తుందని రూ.59.69కోట్ల రాయితీ, టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ సబ్సిడీ రూ.34.93కోట్లు ఇస్తుంది. ఐదేళ్ల పాటు 100శాతం జీఎస్టీ రీయింబర్స్‌మెంట్,జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ కింద రూ.17.80కోట్లు లబ్ధి. ఐదేళ్ల పాటు విద్యుత్ ఛార్జీల్లో యూనిట్‌కి రూపాయి రాయితీ, ఐదేళ్లూ ఎలక్ట్రిసిటీ డ్యూటీ యూనిట్‌కి రూపాయి రాయితీ ఇచ్చింది. విద్యుత్ రాయితీల ద్వారా హెరిటేజ్‌కి రూ.2కోట్లు లబ్ధి చేకూరనుంది. 2శాతం వడ్డీ రాయితీ కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# జగన్‌కు ధైర్యముంటే అభిశంసన తీర్మానానికి మద్దతివ్వాలి: షర్మిల



**విజయనగరం, విశాఖ సమాచారమ్, మార్చి 17 :** వైకాపా అధ్యక్షుడు జగన్‌కు ధైర్యముంటే సీఈసీ జ్ఞానేశ్వర్‌పై పెట్టే అభిశంసనకు మద్దతివ్వాలని ఏపీసీసీ చీఫ్ షర్మిల సవాల్ విసిరారు. విజయనగరం జిల్లా జామిలో పర్యటించిన ఆమె.. వైకాపా ఎంపీలు ఇండియా బ్లాక్ ఎంపీలతో కలిసి సంతకాలు పెట్టాలని, అభిశంసనకు మద్దతిస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. "రాష్ట్రంలో ఈవీఎంలు మారిపోయాయని దొంగ ఏడుపులు ఏడ్చారు కదా. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఇండియా కూటమి పెట్టే తీర్మానికి మద్దతు ప్రకటించాలి. మోదీకి దత్తపుత్రుడు కాదని నిరూపించుకోవాలి. ఎన్నికల సంఘాన్ని ప్రధాని మోదీ తన చేతుల్లో పెట్టుకున్నారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగ విరుద్ధంగా పని చేస్తోంది" అని షర్మిల ఆరోపించారు.

# వివేకా హత్య కేసు నిజాలు దాచేందుకు వైకాపా యత్నం: మంత్రి అనగాని

**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 17 :** మాజీ మంత్రి వివేకా హత్య కేసులో నిజాలు దాచేందుకు వైకాపా ప్రయత్నిస్తోందని మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఆరోపించారు. చెల్లెలు సునీత బాధపై స్పందించకుండా నిందితుడితో ప్రెస్‌మీట్ పెట్టిస్తారా?అని ప్రశ్నించారు. బాబాయ్‌ను చంపిన వారిని కాపాడేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. " ఐదేళ్లు సీఎంగా ఉన్నప్పుడు వాస్తవాలను జగన్ ఏమార్చారు. అధికారం పోయాక బలప్రదర్శన చేస్తున్నారే తప్ప ప్రజలపై ప్రేమ లేదు. జగన్ చెప్పే అబద్ధాలు నమ్మకుండా ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారు" అని అనగాని అన్నారు. ఈ సందర్భంగా వివేకా హత్యపై జగన్, అవినాష్‌రెడ్డి వ్యాఖ్యల వీడియోలు ప్రదర్శించారు.

విశాఖ సమాచారమ్

బుధవారం 18-3-2026

# ఇంధన భద్రతే.. భవిష్యత్ రక్షణ!

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు, హోర్ముజ్ జలసంధి ఉద్రిక్తతల నేపథ్యంలో చమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో పాటు భారత్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుంది?

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నాడిని శాసించే శక్తి చమురుది. ఆ సరఫరా వ్యవస్థలో చిన్నపాటి అలజడి రేగినా, దాని ప్రభావం ఖండాతరాలను దాటి సామాన్యుడి వంట గది వరకు చేరు తుంది. ప్రస్తుతం పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు, ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన 'హోర్ముజ్ జల సంధి' దిగ్బంధన భయాలు ఇంధన మార్కెట్‌ను కుదిపేస్తున్నా కేవలం నెల రోజుల్లోనే బ్రెంట్ క్రూడ్ ధర 70 డాలర్ల నుం డి 110 డాలర్ల మార్కును దాటడం రాబోయే ఆర్థిక సునామీకి సంకేతం. యుద్ధ జ్వాలలు చల్లారకపోతే ఇది 150 డాలర్లకు చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు..

**చమురు ఆయుధంగా మారడం కొత్త కాదు!**

చమురును ఆయుధంగా మార్చుకోవడం ప్రపంచానికి కొత్తేమీ కాదు. 1973 అరబ్-ఇజ్రాయెల్ యుద్ధం సమయంలో 'ఒపెక్' (ౘాజుజ) దేశాలు విధించిన ఆంక్షలు ఇంధన ధరలను రాత్రికి రాత్రే 300 శాతం పెంచి, ప్రపంచాన్ని అతలాకుతలం చేశాయి. ఆ తర్వాత ఇరాన్ విప్లవం, గల్ఫ్ యుద్ధం, నేటి రష్యా-ఉక్రెయిన్ సంక్షోభం వరకు.. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రతిసారి చమురు సంక్షోభానికే దారితీశాయి. ప్రపంచ వినియోగంలో సుమారు 20 శాతం వాటా కలిగిన హోర్ముజ్ జలసంధి గుండా సాగే రవాణా నిలిచిపోతే, అది కేవలం కొరతకు మాత్రమే కాదు, గ్లోబల్ రిసెషన్ (ఆర్థిక మాంద్యం)కు దారితీసే ప్రమాదముంది. భారతదేశం తన చమురు అవసరాల్లో దాదాపు 85 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక్క డాలర్ ధర పెరిగినా మన దేశ విదేశీ మారక నిల్వలపై (Foreign E[illegible]change Reserves) తీవ్ర ఒత్తిడి పడుతుంది. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల రవాణా భారానికి, తద్వారా నిత్యావసరాల ధరల పెరుగుదలకు (ద్రవ్యోల్బణం) దారి తీస్తుంది. ఇది సామాన్యుడి కొనుగోలు శక్తిని హరించివేస్తుంది.

**ఇందన పొదుపు సామాజిక బాధ్యత!**

అందుకే ఇంధన వినియోగ నియంత్రణ ఒక సామాజిక బాధ్యత. ఇంధన పొదుపు కేవలం ప్రభుత్వం చేయాల్సిన పని కాదు.. అనవసర వినియోగం తగ్గించడం, 'కార్ పూలింగ్'ను ప్రోత్సహించడం, సమర్థవంతమైన ప్రజారవాణా వ్యవస్థను ప్రజలు ఆశ్రయించేలా అవగాహన కల్పించాలి. సంక్షోభ సమయాల్లో ఆదుకోవడానికి భూగర్భ చమురు నిల్వలను భారత్ ఇప్పటికే నిర్మించింది. వీటి సామర్థ్యాన్ని పెంచి, కనీసం 90 రోజులకు సరిపడా నిల్వలను సిద్ధం చేసుకోవాలి. తద్వారా అంతర్జాతీయ మార్కెట్ హెచ్చు తగ్గుల నుండి తక్షణ రక్షణ పొందవచ్చు.. అలాగే శిలాజ ఇంధనాలపై ఆధారపడటం తగ్గించడమే శాశ్వత పరిష్కారం. 'గ్రీన్ హైడ్రోజన్' మిషన్, ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహకాలు, ఇథనాల్ బ్లెండింగ్ (పెట్రోల్‌లో ఇథనాల్ కలిపే ప్రక్రియ)ను వేగవంతం చేయాలి. సౌర, పవన శక్తి వంటి పునరుత్పాదక ఇంధన వనరులలో భారత్ ఇప్పటికే అగ్రగామిగా ఎదుగుతోంది, దీన్ని మరింత విస్తరించాలి.

**ఇప్పుడు మేల్కొంటేనే..**

ఇక మన దేశంలోనే ఉన్న చమురు, గ్యాస్ నిక్షేపాలను వెలికితీసేందుకు అత్యాధునిక సాంకేతికతను వాడాలి. అన్వేషణ రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా దిగుమతులపై ఆధారపడటాన్ని కొంతవరకు తగ్గించవచ్చు. 1973 నాటి సంక్షోభం ప్రపంచానికి ఒక హెచ్చరిక అయితే, ప్రస్తుత పరిస్థితులు ఒక కార్యాచరణకు పిలుపు.. ఇంధన రంగంలో 'ఆత్మనిర్భరత' సాధించడం అంటే కేవలం ఆర్థిక విజయం మాత్రమే కాదు, అది దేశ సార్వభౌమత్వానికి రక్షణ. యుద్ధాలు, రాజకీయ విభేదాలు మన నియంత్రణలో లేకపోవచ్చు, కానీ మన ఇంధన వినియోగం, ప్రత్యామ్నాయ వనరుల అభివృద్ధి ఖచ్చితంగా మన చేతుల్లోనే ఉన్నాయి. ఇప్పుడు మేల్కొంటేనే రేపటి తరానికి సుస్థిరమైన, సురక్షితమైన ఆర్థిక భవిష్యత్తును అందించగలం.

**- మేకల కృష్ణ**

# సత్యసాయి చెప్పిన ప్రేమ సాధన

"మనుజ దేహమన్న మున్మయ భాండమే పగులనంతవరకూ
పొగురుచుండు పగిలనేమి కొమికులు పరమాత్మ తత్వంబు సాయి
చరణ రగం శాంతి నొసగు"

ప్రేమ మాధుర్యం మరచిన మానవ దేహం మట్టి కుండ కాక మరేమీ కాదు. విశ్వాసమే శ్వాసగా బతకాల్సిన మానవుడు ఆధ్యాత్మికం అనే గమ్యాన్ని మరచి మానవబంధాలనే అనుమానాలతో ఎండుటాకులాగా ఎగిరిపోతున్నాడు. దీనికి ఉదాహరణగా సత్యసాయి ఒక కథ చెప్పారు. భగవంతుని అనుగ్రహం కోసం ఒక శునకం ఘోరతపస్సు చేసింది.ఆ తపస్సుకు కరుణించి పరమేశ్వరుడు ప్రత్యక్షమై వరం కోరుకో అన్నాడు.నేను మనుష్యుల మధ్య చాలాకాలం జీవించాను.వారు " జంతూనాం నరజన్మ దుర్లభం"అని తరచూ అనేవారు. దాంతో నాకు మానవ జన్మ ఎత్తాలనే కోరిక కలిగింది. ఆ దుర్లభమైన నరజన్మ ప్రసాదించమంది. దేవుడు తథాస్తు అన్నాడు.ఆ శునకం మరుజన్మలో మానవుడిగా జన్మించింది.కాని దురదృష్టవశాత్తు పూర్వజన్మ విశ్వాసం మరిచింది. ఈ జన్మలో భగవంతుని మరచి నాస్తిక సమాజం పెట్టాడు.అధ్యాత్మికం అనే నందనవనానికి దూరం అయ్యాడు. ఈష్యా,అసూయ,ద్వేషం అనే మూడు రాళ్ల పొయ్యి మీద అహంకారం,మమకారం అనే కారం పిండివంటలు వండుకుని తిన్నాడు.ఆ రుచికి బానిస అయ్యాడు.ప్రేమ మాధుర్యం లేక కష్టాలు, కడగండ్లతో జీవించాడు. అలాంటి స్థితిలో ఉన్న మానవుని ఉద్దరించడానికి...

మానవుడిలో అంతరాలు తగ్గించే ఆధ్యాత్మిక జలాన్ని తాగించి దేహభ్రాంతి అనే కుండను పగలగొట్టి ప్రేమ మాధుర్యం చూపించడానికి కరుణతో భగవాన్ గా అవతరించారు. "మధురాతి పతే అఖిలం మధురం "మానవుడికి భగవంతుని పట్ల విశ్వాసం ఎలా ఉన్నా,భగవంతుడు ఎప్పటికైనా మానవుడు తనలో లీనమవ్వాలనే ప్రీతితో పూర్తి ప్రేమతో ఉంటాడు.

"జనులు జనులు కారు జనార్దన లీలయా
నరులు నరులు కారు నారాయణ లీలయా"అన్నట్లు "మానవుడు మాధవుడిగా పరిణామం చెందాలి,అదే అతడి గమ్యం" అని సత్యసాయి చెప్పారు. జంతువులకు లేని విద్య అనే ఖడ్గం,వివేకం అనే డాలు మానవుని మస్తిష్కం లో మాత్రమే ఉంటాయి. పూర్వజన్మ స్మృతి,జన్మ పరంపర,పాపపుణ్యాల కర్మల గూర్చి తెలుసుకునే జ్ఞానం ఉంది.అది గ్రహించలేక మానవుడు "నేను నేను"అనే అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతున్నాడు.బూడిదగా మారే ఈ శరీరం తానే అనుకుంటూ అజ్ఞానంలో పడ్డాడు. పాపం, శాపం,తాపం తో బంధింప బడ్డాడు. ధర్మచ్యుతికి పాల్పడడమే పాపం.ఇతర ప్రాణులను హింసించడమే శాపం.అశాశ్వతమైన దేహం శాశ్వతమని, జగత్తు మిధ్య అని తెలుసుకోకపోవడం తాపం.

దేహమనే ఉపకరణాన్ని దైవసేవకు ఉపయోగించాలని శంకరులు వివేకచూడామణిలో వివరించారు.మజ్జ, కొవ్వు,మాంసం,ఎముకలు, రక్తం,చర్మం వంటి సప్త ధాతువులతో మానవ శరీరం ఏర్పడుతుంది. "అన్నార్భవంతి భూతాని" అన్నారు గీతాచార్యుడు. తల్లిదండ్రులు భుజించిన ఆహారం అండం,శుక్లంగా మారి సంగమంతో బిడ్డ గా జన్మిస్తాడు.మరణానంతరం ఇతర జీవులకు ఆహారంగా మారుతాడు.అందుకే దాన్ని అన్నమయకోశమంటారు. ఈ సత్యం తెలుసుకుని దైవసేవలో దేహమనే ఉపకరణాన్ని ఉపయోగించుకోవాలని చెప్పాడు. దీనికి సంబంధించి ఒక కథ ఉంది. ఆచార పరాయణురాలైన ఒక స్త్రీ రాజస్తాన్ కు తీర్థయాత్ర లకు వెళుతుంది.ఆ ప్రాంతంలో జంతుచర్మాలతో తయారుచేసిన తోలుతిత్తి లో నీరు సరఫరా చేస్తారు.ఆ స్త్రీ దాహం అని అడిగితే ఒక వ్యక్తి తోలుతిత్తి లోని నీరు ఇస్తాడు.ఈ తోలుతిత్తి పరిశుద్ధమైనదేనా అని అడిగింది. దానికి అతడు అమ్మా! నీ శరీరమనే ఏ తోలుతిత్తిలో నీరు పోయబోతున్నారో దానికంటే ఇది పరిశుద్ధమైందని బదులిచ్చాడు.ఇప్పటికీ మరణం తర్వాత మానవ శరీరం పశుపక్ష్యాదులకు ఆహారంగా వేసే సాంప్రదాయం ఆ ప్రాంతంలో ఉంది.

"దేహమే క్షేత్రం,మనస్సే రైతు, పాపపుణ్యాలు పంట" అంటారు తులసీదాసు. "పునరపి జననం పునరపి మరణం" లాగా నిరంతరం ప్రయాణించే జీవుడి తుది గమ్యం జన్మ రాహిత్యమే.కాని దాన్ని సాధించాలంటే పట్టుదల,సత్కర్మలు చేయడమే మార్గమని అదే ఆధ్యాత్మిక మార్గమని స్వామి అన్నారు.జపం,ధ్యానం,సత్సంగం,నగర సంకీర్తన,సాధ్యాయం వంటి వాటిద్వారా 'సాధనమునసమకూరు ధరలోన' లక్ష్యంగా మానవ జీవితం ఉండాలన్నారు. సద్గుణ సంపత్తి ద్వారా ప్రేమ సాధన చెయ్యడమే అన్నిటికంటే గొప్పజీవితమని సత్యసాయి బోధించారు.

**యం.వి.రామారావు**

# LPG కొరత: అంతా బాగానే ఉందా?

ఒక వైపు 'అంతా బాగానే ఉంది', గ్యాస్ కొరత లేదని చెబుతున్న ప్రభుత్వం, మరోవైపు ప్రజలు బుకింగ్ చేసిన తర్వాత వారి గ్యాస్ సిలిండర్లను సులభంగా పొందుతున్నారని పేర్కొంటూ అధికారుల ప్రచారం జరుగుతోంది. కానీ వాస్తవ పరిస్థితి మరోలా ఉంది.

ఈ గందరగోళ పరిస్థితుల్లో ఎవరూ సామాన్యుల ఇబ్బందులను గురించి పెద్దగా పట్టించుకోవటం లేదు. వాణిజ్య గ్యాస్ సిలిండర్లు కూడా ఇప్పుడు చాలా నగరాల్లో అందుబాటులో లేవు. వాణిజ్య సిలిండర్ సరఫరాపై ఆంక్షలు ఆందోళనకరంగా మారాయి. రేషన్‌ను అమలుచేయడం వల్ల అనేక రెస్టారెంట్లు మూతపడ్డాయి. కేటరింగ్ వ్యవస్థ చాలా చోట్ల బంద్ అయింది. పార్లర్లు... మినీ హెటళ్లు కొన్ని ఇప్పటికే క్లోజ్. హాస్పిటల్స్ కూడా ఇబ్బంది పడుతున్నాయి. ఆందోళనలో అటు హోటల్ పరిశ్రమ ఇటు హాస్పిటల్స్ ఉన్నాయి. కొన్ని సాంప్రదాయ కట్టెల పొయ్యిలకు తిరిగి రావాల్సి వచ్చింది.

ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే, దేశం నిజంగానే ఒక క్లిష్టమైన ఇంధన సంక్షోభం (జుఅవతీస్రఎ జతీఅంఱం) అంచున ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రభుత్వం పైకి 'అంతా బాగుంది' అని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో అనేక కఠిన నిబంధనలు అమలు చేయడం మరియు మార్కెట్‌లో ఎలక్ట్రిక్ వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నాయి.

1. క్షేత్రస్థాయి వాస్తవాలు జం ప్రభుత్వ ప్రకటనలు

సరఫరా గొలుసు (Supply Chain: ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా వివాదం వంటి అంతర్జాతీయ కారణాల వల్ల దిగుమతులు తగ్గడం సహజంగానే కొరతకు దారితీస్తుంది.

బ్లాక్ మార్కెటింగ్: కొరత ఏర్పడినప్పుడు అక్రమ నిల్వలు పెరగడం, తద్వారా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మడం సామాన్యుడిని కోలుకోలేని దెబ్బ తీస్తుంది.

ఎలక్ట్రిక్ వస్తువుల డిమాండ్: గ్యాస్ లేకపోవడంతో అందరూ ఒక్కసారిగా ఇండక్షన్ స్టవ్‌లు, కెటిల్స్ వైపు మళ్లడం వల్ల వాటి ధరలు అనేక రెట్లు పెరగడం విచారకరం.

2. ప్రత్యామ్నాయ మార్గాలు: మనం ఏం చేయగలం?

సంక్షోభం వచ్చినప్పుడు నాయకుల కోసం వేచి చూడకుండా, వ్యక్తిగతంగా మనల్ని మనం సిద్ధం చేసుకోవడం ముఖ్యం:

మిశ్రమ వంట విధానం (ఎఎతీఱఅ జశీశీఱఅస్త్ర): కేవలం గ్యాస్‌పైనే ఆధారపడకుండా, ఇండక్షన్ స్టవ్‌లు లేదా సోలార్ కుక్కర్లను (అందుబాటులో ఉంటే) వాడటం అలవాటు చేసుకోవాలి.

సాంప్రదాయ పద్ధతులు: గ్రామీణ ప్రాంతాల్లో లేదా వీలున్న చోట మళ్లీ కట్టెల పొయ్యి లేదా బొగ్గు పొయ్యి వంటి సహజ వనరుల వాడకం వైపు మొగ్గు చూపడం ఒక తాత్కాలిక పరిష్కారం కావచ్చు.

పొదుపుగా వాడటం: గ్యాస్ వినియోగాన్ని తగ్గించేలా వంట పద్ధతులను మార్చుకోవడం (ఉదాహరణకు: ప్రెజర్ కుక్కర్ల వాడకం, నీటిని వేడి చేయడానికి సోలార్ వాటర్ హీటర్లు వాడటం).

3. భవిష్యత్తు సవాళ్లు

ఒకవేళ గల్ఫ్ దేశాలలో ఉద్రిక్తతలు పెరిగితే, అది కేవలం ౘా+ మాత్రమే కాకుండా పెట్రోల్, డీజిల్ ధరలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇది రవాణా ఖర్చులను పెంచి, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు (×అటశ్రీఫ్‌ఱశీఅ) దారితీస్తుంది.

ఇటువంటి సమయాల్లో ప్రజలు ఆందోళన చెందడం కంటే, ఉన్న వనరులను పొదుపుగా వాడుకోవడం, ఆచరణాత్మక పరిష్కారాలతో సిద్ధం కావడం మంచిది. ఒకరికొకరు మద్దతు ఇవ్వడం ద్వారా సమాజాలు ఈ క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కోవడం లోనూ మరియు అధిగమించటం లోనూ సహాయపడాలి.

**డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు,**
**మాజీ రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం,**
**మేనేజింగ్ ట్రస్టీ, లయన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, విశాఖపట్నం.**

# మనసు మీదా యుద్ధ మేఘం !

యుద్ధాలు ఇప్పుడు నిత్యకృత్యంగా మారాయి! ఒకవైపు రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతుండగానే.. మరోవైపు ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ యుద్ధం మొదలైంది. కొద్దిరోజులే అయినా ఆ మధ్య భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు, దాడులు, ప్రతిదాడుల సంగతి సరేసరి. ఇలాంటి భీతావహ వాతావరణాలు ఆస్తి, ప్రాణ నష్టాలకే పరిమితం కావు.. మనసు మీదా తీవ్ర ప్రభావం చూపుతాయి.

ఎక్కడో యుద్ధం జరిగితే మనకేంటి? అనుకునే రోజులు కావివి. ఆర్థిక, వ్యాపార లావాదేవీలతో ప్రపంచమంతా ముడిపడి ఉందనేది కాదనలేని సత్యం. అందువల్ల ఎక్కడ యుద్ధం మొదలైనా ఇతర దేశాల మీద ప్రభావం తప్పదు. వంట గ్యాస్ కొరత ఇప్పుడు ఇంటింటి చర్చగానూ మారిన సంగతి తెలిసిందే. విదేశాల్లో చదువుకునేవారు, ఉద్యోగాలు చేసేవారు ఎందరో. మనదేశానికి చెందినవారి మరణాల ఉదంతాలూ కలవర పరుస్తున్నాయి. ఎవరికి ఏమవుతుందో, ఏమయ్యిందోనన్న భయాలు.. ప్రసార మాధ్యమాల్లో ఆస్తి, ప్రాణ నష్టాల దృశ్యాలు.. సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాల వంటివన్నీ మనసును అతలాకుతలం చేసేవే. ఇలాంటి అనుభవాలు మనసు మీద చెరగని ముద్ర వేస్తాయి. ఆందోళన, కుంగుబాటు, వేదన అనంతర తీవ్ర ఒత్తిడి (పీటీఎస్‌డీ) వంటి సమస్యలకూ దారితీస్తాయి. ఇవి దీర్ఘకాలం.. ఆ మాటకొస్తే జీవితాంతం వెంటాడొచ్చు. కాబట్టి సంక్షోభ సమయాల్లో అనవసర భయాలకు గురికాకుండా చూసుకోవటం, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవటం ఎంతైనా అవసరం.

భీతావహ ఘటనలు ఏవైనా..

నిజానికి ఒక్క యుద్ధ వాతావరణం ఒక్కటే కాదు.. హఠాత్తుగా ముంచుకొచ్చే ఎలాంటి సంక్షోభాలైనా మనసు మీద విపరీత ప్రభావం చూపిస్తాయి. కాకపోతే యుద్ధాల సమయంలో దీని ముప్పు మరింత ఎక్కువ. టీవీలు, వెబ్‌సైట్లు నిరంతరం సమాచారం అందిస్తూనే ఉంటాయి. వీటికితోడు ఇప్పుడు సామాజిక మాధ్యమాలు. ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియని పరిస్థితి. అసత్య ప్రచారాలకూ కొదవలేదు. అప్పటివరకూ సురక్షితంగా ఉన్నామనే నమ్మకాన్ని ఇవన్నీ ఛిద్రం చేసేస్తాయి. అభద్రతా భావానికి గురిచేస్తాయి. ఇప్పటికే మానసిక సమస్యలతో బాధపడుతున్నవారు.. మద్యం, మాదకద్రవ్యాల వంటి దురలవాట్లు గలవారు ఇంకాస్త ఎక్కువగా భయాలు, ఆందోళనకు గురికావొచ్చు.

ప్రత్యక్ష అనుభవమే అక్కర్లేదు

భీతావహ, హింసాత్మక సంఘటనలకు నేరుగా గురికాకపోవచ్చు. ప్రత్యక్షంగా చూడకపోవచ్చు. వాటి గురించి విన్నా, ఫొటోలు, వీడియోలు చూసినా మనసు కలుక్కుమంటుంది. ఇది తక్షణమే కాదు, యుద్ధ వాతావరణం ఎంత ఎక్కువకాలం కొనసాగితే అంత ఎక్కువగా ప్రభావం చూపుతూ వస్తాయి. భయానక దృశ్యాలు చూస్తున్నకొద్దీ, వాటి గురించి వింటున్నకొద్దీ మానసిక ఒత్తిడి తీవ్రమవుతూ రావొచ్చు. ఇలాంటి మానసిక స్థితి సర్దుకోక పోయినట్టయితే ఆందోళన, పీటీఎస్‌డీ, కుంగుబాటు వంటి మానసిక సమస్యల ముప్పు పెరుగుతూ వస్తుంది.

సర్దుకునేదే అయినా..

హఠాత్ సంక్షోభాలు, అనూహ్య ఘటనలు, పరిణామాలు ఎదురైనప్పుడు మొదట్లో కొంత గాబరా పడినా తర్వాత కుదురుకుంటాం. ఉదాహరణకు- యుద్ధం ఎల్లకాలమూ కొనసాగదని, కొన్నిరోజుల తర్వాత అంతా సర్దుకుంటుందని నమ్ముతుంటాం. ఆయా పరిస్థితులకు అనుగుణంగా నడచుకోవటానికీ ప్రయత్నిస్తాం. కానీ కొందరు మాత్రం విపరీతంగా స్పందిస్తుంటారు. తీవ్ర ఒత్తిడికి లోనవుతుంటారు. ఇదిలాగే కొనసాగితే మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. జనాభాలో సుమారు 10% మందిలో ఇలాంటి ధోరణి కనిపిస్తున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. ఏదో కొద్దిరోజులంటే ఏమో అనుకోవచ్చు. కానీ యుద్ధాలు దీర్ఘకాలం కొనసాగితే రోజువారీ జీవితంలో హింసనూ ఒక భాగంగా పరిగణించాల్సిన అగత్యం ఏర్పడొచ్చు. దీనికి సర్దుకోలేనివారిలో చిరాకు, బాధ, ఆదుర్దా, నిద్రలేమి వంటి మానసిక ఇబ్బందులు ఎక్కువవుతాయి. మగవారు.. ముఖ్యంగా యువకులు భవిష్యత్ మీద ఆందోళనతోనో, ఏమీ తోచకనో అంతర్జాలం, సామాజిక మాధ్యమాలు అతిగా చూడొచ్చు. మద్యం, పొగ తాగటం వంటి వ్యసనాలకూ లోనవ్వచ్చు.



ఎందుకిలా?

అదేపనిగా యుద్ధ వాతావరణాన్ని తలచుకోవటమో, వినటమో, దృశ్యాలు చూడటమో.. ఏదైనా గానీ శరీరాన్ని, మనసును నిరంతరం అప్రమత్త స్థితిలో ఉంచుతాయి. దీంతో ఒంట్లో సింపథెటిక్ నాడీ వ్యవస్థ విపరీతంగా ప్రేరేపితమవుతుంది. ఫలితంగా ఒత్తిడిని కలగజేసే అడ్రినలిన్, నార్‌అడ్రినలిన్ వంటి హార్మోన్లు పెద్దఎత్తున విడుదలవుతాయి. సాధారణంగా ఇవి ప్రమాదాల నుంచి పారిపోవటానికి లేదా వాటిని ఎదుర్కోవటానికి తోడ్పడతాయి. కానీ అదేపనిగా, అనవసరంగా విడుదలైతే మాత్రం మానసిక ఒత్తిడికి దారితీస్తాయి. దీని మూలంగా తరచూ గుండెదడ, శ్వాస వేగంగా తీసుకోవటం, నిద్రలేమి, పీడకలలు, భయానక ఆలోచనలు, త్వరగా అలసిపోవటం, దిగులు, నిరాశ వంటి సమస్యలూ తలెత్తుతాయి. కొందరిలో తాత్కాలికంగా వ్యక్తిత్వ ధోరణీ మారిపోవచ్చు. కుటుంబ సభ్యులను చీదరించుకోవటం, కోపగించుకోవటం వంటివీ కలగొచ్చు. దీన్ని సరిగా నియంత్రణలో ఉంచుకోకపోతే విపరీత పరిణామాలకు దారితీస్తుందని గుర్తించటం చాలా ముఖ్యం.

పిల్లల మీద ఎక్కువ ప్రభావం

భీతావహ ఘటనలు, యుద్ధ వాతావరణాలు ప్రత్యేకించి పిల్లల మీద విపరీత ప్రభావం చూపుతాయి. ఇవి జరుగుతున్నంత కాలం బయటే కాదు, ఇంట్లోనూ పెద్దవాళ్లు ఎక్కడ, ఏమవుతోంది అని తెలుసుకోవటానికి టీవీలకు అతుక్కుపోతుంటారు. ఎడతెగని చర్చలు, వాదోపవాదాల్లో నిమగ్నమవుతుంటారు. పిల్లలతో మాట్లాడటం, వారితో గడపటం తగ్గిస్తారు. ఇవన్నీ చిన్నారుల మీద చెడు ప్రభావం చూపుతాయి. భవిష్యత్తు గురించి భయాలు, ఆందోళనలు ఎక్కువవుతాయి.

ఎలా కాపాడుకోవాలి?

కుటుంబంతో అనుబంధం: భయానక పరిస్థితులను ఎలా ఎదుర్కొంటున్నాం, వాటికి ఎలా స్పందిస్తున్నామనేది కీలకం. ఇందులో కుటుంబ అనుబంధాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా పిల్లలకు పెద్దవాళ్ల అండ చాలా అవసరం. కాబట్టి వారికి తగినంత సమయం కేటాయించాలి. వారి అవసరాలను గుర్తించి, నడచుకోవాలి. పిల్లలు తమ భయాలు, ఆందోళనలను సరిగా చెప్పలేరు. కొందరు ఏడ్వచ్చు, కొందరు చిరాకు పడొచ్చు. వీటిని గుర్తించాలి. హింసాత్మక, భయానక దృశ్యాలను వీలైనంతవరకూ పిల్లల కంట పడకుండా చూడాలి. పుస్తకాలు చదవమని ప్రోత్సహించటం వంటి వాటితో భయానక ఘటనల నుంచి మనసును మళ్లించే ప్రయత్నం చేయాలి.

పనులు మామూలుగా: వేళకు భోజనం చేయాలి, నిద్ర పోవాలి. తగినంత నీరు తాగాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. తోటపని, సంగీతం వినటం వంటి విశ్రాంతి కార్యక్రమాలకూ ప్రాధాన్యం ఇవ్వాలి. వీలైతే వీటికి మరింత సమయం కేటాయించాలి. మద్యం, పొగ తాగటం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి.

సరైన సమాచారం: విశ్వసనీయమైన, ప్రభుత్వ సంస్థలు అందించే సమాచారాన్ని తెలుసుకోవాలి. అనవసర భయాలకు గురికావద్దు. ఇప్పుడు కృత్రిమ మేధ సాయంతో కొన్ని వీడియోలను మార్చి, అసత్య ప్రచారాలు చేయటమూ ఎక్కువైంది. కాబట్టి ఏది పడితే దాన్ని నమ్మొద్దు. ఆలోచన తీరు మార్చుకోవాలి: నకారాత్మక ఆలోచనలను, అతిగా స్పందించటాన్ని తగ్గించు కోవాలి. భయం కలిగినప్పుడు గుండెదడ, శ్వాస వేగం పెరగటం మామూలేనని.. పరిస్థితి కుదురుకున్నాక ఇవీ తగ్గేవేనని తెలుసుకోవాలి.

పాఠాలుగా: సంక్షోభ సమయాల్లో ఎలా ప్రవర్తించాలి? ఎలా ఎదుర్కోవాలి? అనే అంశాలను పాఠ్యక్రమంలో చేర్చాలి. అప్పుడు సమస్య ఏంటి? అదెక్కడ మొదలైంది? దానికి పరిష్కారమేంటి? ఎలా నడుచుకోవాలి? అనేవి పిల్లలకు అలవడతాయి. యుద్ధాల వంటివాటిని ఆపటానికి అంతర్జాతీయ సంస్థలు ఎప్పటికప్పుడు ప్రయత్నం చేస్తుంటాయని చెబితే వారికి భరోసా కలుగుతుంది.

నలుగురితో కలివిడిగా: ఇతరులతో కలిసి, ఆలోచనలను పంచుకోవటం చాలా ముఖ్యం. మనం భయపడినంతగా పరిస్థితి లేదని ఇతరులు చెప్పినప్పుడు మనసు సాంత్వన పడుతుంది.

నిపుణుల సాయం: రెండు వారాల కన్నా ఎక్కువగా ఆందోళన, భయం, నిద్రలేమి వంటి వాటితో సతమతమవుతుంటే మానసిక నిపుణుల సాయం తీసుకోవటానికి సంకోచించొద్దు. కౌన్సెలింగ్‌తో మంచి మానసిక బలం లభిస్తుంది. ఆలోచనా తీరును మార్చుకోవటం, ధైర్యంగా ఉండటం నేర్పిస్తారు. అవసరమైతే ఆయా లక్షణాలను బట్టి ఆందోళన, కుంగుబాటు, మానసిక ఒత్తిడి తగ్గటానికి.. నిద్ర సరిగా పట్టటానికి మందులు సూచిస్తారు.

## 90ల్లోకి వెళ్దామా



టీవీలో 'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్ చూడకపోతే పొద్దుపోని రోజులవి. పిల్లలందరూ కార్టూన్ ఛానెళ్లలో మునిగిపోతున్నా.. నేను మాత్రం నాన్నమ్మతో కలిసి ఆ హవేలీలో విహరించేదాన్ని. ఆనంది చేసే అల్లరిని ఆస్వాదిస్తూ.. మధ్యమధ్యలో అమ్మ తిట్లు కూడా విని తరించేదాన్ని. 'ఎంతసేపూ ఆ సీరియల్ ముందు కూర్చోకపోతే కాసేపు పుస్తకం తీయొచ్చుగా' అని అంటున్నా.. మనం లేస్తేగా! ఆరోజు పొద్దున్నే స్కూల్‌కి వెళ్లా.. ఎప్పుడూ లాగానే సాయంత్రం వచ్చేశా. చెకోడీలు తింటూ చల్లగా రిలాక్స్ అవుతుంటే..ఉప్పెనలా దూసుకొచ్చింది అమ్మ. 'నీకెంత ధైర్యం, ఆరో క్లాసైనా పాసవ్వలేదు.. అప్పుడే అంత పెద్దదానివి అయిపోయావా? పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నావంట.. ఇప్పుడే ఇలా ఉంటే, తర్వాత మా పరిస్థితి ఏంటి, అసలు భయం లేక ఇలా తయారయ్యావ్..' అంటూ ఒకటే గోల. ఏం జరిగిందో తెలియక అయోమయంలో ఉన్నా నేను. ఈలోగా లోపలి నుంచి నాన్నమ్మ, నాన్న గబగబా వచ్చారు. 'ఏమైంది, ఏంటి' అని కంగారుగా అడిగారు. 'మీ అమ్మాయి బళ్లో వెలగబెట్టిన ఘనకార్యం ఏమిటో తెలుసా.. స్కూల్‌లో ఓ అబ్బాయితో 'నన్ను పెళ్లి చేసుకుంటావా, చదువు మానేసి మీ ఇంటికొచ్చేస్తా.. నన్ను బాగా చూసుకోవాలి మరి.. అని చెప్పిందంట! వేలెడంత లేదు.. అప్పుడే ఏం మాటలవి..' అంటూ చెవి మెలిపెట్టింది. అలా చాలా కేకలేసిన తర్వాత నాన్నమ్మ కాసింత సర్దిచెప్పడంతో శాంతించింది. ఆరోజు నుంచి టీవీ, సీరియల్ రెండూ బంద్. కానీ నా టాప్ సీక్రెట్ అమ్మకి చేరవేసిన ఆ వేగు ఎవరో ఇప్పటికీ తెలియని ఓ మిస్టరీగా మిగిలిపోయింది.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

ప్రకటన నెం. eT-Central-WAT-07-2026 తేదీ. 10.03.2026

**పని పేరు:** వాల్తేరు డివిజన్ నందలి అన్ని స్టేషన్లు వద్ద దివ్యాంగులు కొరకు సదుపాయములు ఏర్పాటు చేయు పనులకు సంబంధించి సీనియర్ డివిజనల్ ఇంజనీరు/సెంట్రల్/వాల్తేరు వారి పరిధిలోని వేర్వేరు స్టేషన్లు వద్ద టక్‌టైల్ టైల్స్, ర్యాంపులు కొరకు హేండ్ రెయిల్స్ మరియు మాడ్యులర్ టాయిలెట్ ఏర్పాటు చేయుట.

**సుమారు పని విలువ:** ₹ 2,76,36,819.93, బయానా: ₹ 5,52,700/-. పని పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు) నెలలు.

**టెండరు ముగింపు తేదీ మరియు సమయం:** 02.04.2026న 1500 గంటలకు.

ఇందుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు ఇ-టెండర్లకు సంబంధించి పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా తమ సంస్థ లెటర్ హెడ్స్ పైన, సకాలంలో అందునట్లు పంపినప్పటికీ అంగీకరించబడవు. అట్టి అన్ని మాన్యువల్ ఆఫర్లు చెల్లుబాటు కానివిగా పరిగణించవడతాయి మరియు ఎలాంటి పరిశీలన లేకుండానే తిరస్కరించబడతాయి. పై ఇ-టెండరుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు www.ireps.gov.in వెబ్‌సైట్ నందు లభిస్తాయి.

సూచన: విశ్వసనీయ టెండరుదారులు ఈ టెండరుకు సంబంధించి ఏదైన మార్పులు / సవరణలు కోసం టెండరు ముగింపు తేదీకి 15 (పదిహేను) రోజులు ముందుగా ఈ టెండరును మరొకసారి చూడవలసినదిగా సలహానీయటమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇంజనీరింగ్) వాల్తేరు

PR-1234/Q/25-26


## గూగుల్ వారి డిస్కో.. వెయిట్ లిస్ట్!




ఇంటర్నెట్‌ను బ్రౌజ్ చేయడానికి అనుమతించే సంప్రదాయ బ్రౌజర్‌ల మాదిరిగా కాకుండా, గూగుల్ 'డిస్కో' జెన్ ట్యాబ్స్‌ను ఉపయోగిస్తుంది. ప్రశ్న లేదా ప్రాంప్ట్‌లను ఇన్‌పుట్‌గా తీసుకుంటుంది. వీటికి సంబంధించిన ట్యాబ్‌లను ఓపెన్ చేస్తుంది. అంతేకాదు మనం సెర్చ్ చేస్తున్నదానికి సంబంధించి కస్టమ్ యాప్ క్రియేట్ చేస్తుంది. ఉదాహరణకు... మనం 'డిస్కో'ను ట్రావెల్ టిప్స్ అడిగితే ఆటోమేటిక్‌గా ప్లానర్ యాప్‌ను క్రియేట్ చేస్తుంది. గూగుల్ క్రోమ్‌లాగే బ్రౌజింగ్, ట్యాబ్‌లను ఒపెన్ చేయడం, ఎక్స్‌టెన్షన్స్, పేజీలను నావిగేట్ చేయడంలో 'డిస్కో' ఉపయోగపడుతుంది.

ఈ కొత్త బ్రౌజర్‌తో యూజర్‌లు ఎలాంటి కోడ్‌ను రాయాల్సిన అవసరం ఉండదు. మనకు కావాల్సిన వాటిని సింపుల్‌గా వివరిస్తే సరిపోతుంది. ఈ ఏఐ జనరేటెడ్ వెబ్ యాప్‌తో టెక్స్ ప్రాంప్ట్‌ల ద్వారా లేఅవుట్స్, విజువల్, ఫీచర్స్‌కు సంబంధించి మార్పు చేర్పులు చేయవచ్చు.ప్రతి జనరేటెడ్ కంటెంట్ ఒరిజినల్ వెబ్ సోర్స్‌తో లింకై ఉంటుంది. మీల్స్ ప్లాన్, ట్రావెల్ ప్లాన్, పిల్లలకు గ్రహాల గురించి పరిచయం చేయడానికి విద్యార్థులకు కూడా బాగా ఉపయోగపడుతుంది డిస్కో. ఒక నిర్దిష్టమైన అంశం గురించి తెలుసుకోవాలనుకుంటే, ఆ అంశానికి సంబంధించి జెన్ ట్యాబ్ ఒక యాప్‌ను క్రియేట్ చేస్తుంది. సమాచారాన్ని విజువలైజ్ చేసి కాన్సెప్ట్ సులభంగా అర్థమయ్యేలా చేస్తుంది.

'డిస్కో ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. ప్రతీది సరిగ్గా పనిచేయకపోవచ్చు. ఇది తక్కువ మంది టెస్టర్‌లకు మాత్రమే అందుబాటులో ఉన్నందున దీనిని యాక్సెస్ చేయడానికి మీరు వెయిట్ లిస్ట్‌లో చేరాల్సి ఉంటుంది' అని గూగుల్ ప్రకటించింది.

## ఇళ్ల ధరలు 5 శాతం అప్



మనుషులను ప్రేమించడం మనకు తెలిసిందే. కానీ కొత్తగా ఏఐని ప్రేమిస్తున్నారు ఇప్పటి కుర్రకారు. 'అదేంటీ..ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ప్రేమ ఎలా?' అని ఆశ్చర్యపోకండి. ఎదుటి మనిషిని నమ్మడం, ప్రేమించడం, కలిసి బతకడం కష్టమని భావించి.. తమ మనోభావాలను అర్థం చేసుకునే కంప్యూటర్లతో కాలం గడపడం మంచిదని అనుకుంటున్నారు కొందరు. అందుకే ఏఐతో డేటింగ్ చేస్తున్నారు.

ఈ ఏఐ డేటింగ్ కోసం యువత రెప్లికా, చాట్‌జీపీటీ వంటివి ఉపయోగిస్తున్నారు. కొందరైతే మరో అడుగు ముందుకేసి ఏఐ చాట్‌బాట్‌లతో నిశ్చితార్థం, వివాహం చేసుకుంటున్నారు. జపాన్‌లో ఓ వ్యక్తి చట్టబద్ధంగా హాలోగ్రాఫిక్ ఏఐ విగ్రహాన్ని పెళ్లి చేసుకున్నాడు. కానీ చాలా సందర్భాల్లో ఇలాంటి పెళ్లిళ్లకు చట్టబద్ధత ఉండదు. సామాజిక ఆమోదం కూడా తక్కువే. కానీ ఏఐ తమ మనసు అర్థం చేసుకుంటుందని భావించడం, చెప్పింది వినడం తప్ప దాంతో ఏ గొడవా ఉండదని అనుకోవడంతో ఇలా జరుగుతోందట.

మనుషులతో కంటే ఏఐతో రిలేషన్‌షిప్‌లో ఉండటం సులువని భావిస్తున్నారట. కొంతమంది ఏఐ భాగస్వాములను నిజమైన వ్యక్తుల్లా చూస్తున్నారట. అతికొద్ది మంది శృంగారపరమైన విషయాలకూ దీనిపై ఆధారపడుతున్నారట.

ఎందుకిలా..

ప్రస్తుతం ఉన్న బిజీ జీవితాల్లో ఎవరి పనులు వారికే సరిపోతున్నాయి. ఒకరితో ఒకరు మాట్లాడుకునే పరిస్థితి లేకుండా పోయింది. దీనివల్ల ఒంటరితనమే మిగులుతుంది. ఇలాంటి సమయంలో మనుషుల కంటే ఏఐ బెటరని భావిస్తున్నారట.

ఆఫీస్, ఇతర పనుల్లో ఏదైనా ఒత్తిడిగా అనిపించినప్పుడు వారు ఏఐ సలహాలు తీసుకుంటున్నారు. కష్టసుఖాలను దాంతో పంచుకుంటున్నారు. దీనివల్ల మానసిక భారం తగ్గినట్లు ఫీలవుతున్నారు.

స్మార్ట్ ఫోన్‌తో విడదీయరాని బంధం కూడా దీనికో కారణం. అన్నింటికీ దాన్ని వాడినట్టే రిలేషన్‌షిప్ కోసం దాని మీదే ఆధారపడుతున్నారు.

షాపింగ్, ఫుడ్, ట్రావెలింగ్ మొదలైన వారి రోజువారీ పనులకు ఏం చేయాలనే విషయాలను కృత్రిమ మేధస్సునే అడుగుతున్నారు.

చదువులు, కెరియర్ కోసం ఇంటికి దూరంగా ఉండేవారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఆ మానసిక శూన్యాన్ని తగ్గించుకోవడానికి ఇదో మార్గంగా వారికి కనిపిస్తుంది.

నష్టాలే ఎక్కువ

ఒంటరితనం నుంచి దూరం కావడానికి ఏఐ వాడుతూ ఉండొచ్చు. కానీ దీనివల్ల నష్టాలే ఎక్కువ. డిప్రెషన్, ఆందోళన, యాంగ్జయిటీ వంటివి పెరుగుతున్నాయి. చివరికి బయటి ప్రపంచంతో సంబంధం లేదనే భావనకు లోనవుతారు.

కొన్నిసార్లు నిజమైన బంధాలు దూరమైపోయే పరిస్థితి తలెత్తవచ్చు.

ఏఐ అన్నిసార్లూ సరైన సమాధానాలు ఇవ్వకపోవచ్చు. దీనివల్ల తప్పుడు నిర్ణయాలు తీసుకునే ప్రమాదం ఉంది.

మనుషుల మాదిరిగా దీనికి ఆలోచన, భావోద్వేగాలు ఉండవు. నెట్‌వర్క్ ఉన్నంత వరకే పనిచేస్తుంది. ఒకవేళ సరైన నెట్‌వర్క్ లేని పరిస్థితుల్లో మనం దాని మీద ఆధారపడే పరిస్థితి వస్తే అంతే సంగతులు.


శ్రీరస్తు ఓం శుభమస్తు అవిఘ్నమస్తు

**శ్రీ కంచి కామకోటి శంకర మఠం**

ద్వారకానగర్, విశాఖపట్నం-16

శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలతో

**శ్రీ "పరాభవ" నామ సంవత్సర ఉగాది పర్వదినం**

సందర్భముగా

| తేది | వారం | కార్యక్రమం & సమయం |
|---|---|---|
| 19-03-2026 | గురువారం శ్రీ "పరాభవ" నామ ఉగాది | సాయంత్రం గం॥ 6-00 లకు శ్రీ కందాళ వేంకట సత్య శ్యామ్ గారిచే పంచాంగ శ్రవణం నిర్వహించబడును |

కావున పురజనులెల్లరూ అత్యధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమమును జయప్రదం చేయగోరుచున్నాము

ఇట్లు
శ్రీ కంచికామకోటి శంకర మఠం
కార్యనిర్వాహక వర్గం

విశాఖపట్నం
తేది: 12-03-2026


## సంగీతం మానసిక ప్రశాంతతను అందిస్తుంది

**-విద్యార్థులే విశ్వవిద్యాలయానికి అంబాసిడర్లు**
**-సహనం, క్రమశిక్షణతో విజయం సాధ్యమవుతుంది**
**-జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్**

**ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖ సమాచారం:** సంగీతం మానసిక ప్రశాంతతను అందిస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఏయూ సంగీత, నృత్య విభాగం ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని నిర్వహించిన శతాబ్ది కళా ఉత్సవం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి సాధించే ప్రగతి, ప్రవర్తన విశ్వవిద్యాలయంపై ప్రభావం చూపుతుందన్నారు. వర్సిటీ విద్యార్థులు ఏయూకు అంబాసిడర్లుగా నిలవాలన్నారు. ప్రతీ వ్యక్తి జీవితంలో సంగీతం, నృత్యం అంతర్భాగం కావాలన్నారు. శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న సమయంలో ఏయూ అభివృద్ధికి కృషి చేసిన వారిని గుర్తు చేసుకోవాలన్నారు. ఎందరో మహనీయుల కృషి ఫలితంగా నేడు ఏయూ ఇంతటి అభివృద్ధిని సాధిస్తోందన్నారు. ఏయూ మరో వెయ్యేళ్లు తన సేవలు అందించడానికి అవసరమైన బలమైన పునాదులు మనం నేడు వేయాలన్నారు. విశిష్ట అతిథి శతాధిక వృద్ధులు, సంగీతకారులు పద్మశ్రీ అన్న వరపు రామస్వామి మాట్లాడుతూ గురువులను, తల్లిదండ్రులను ఎన్నడూ మరువరాదన్నారు. నేడు తనకు జరిగిన సన్మానం సంగీతానికి జరిగిన సన్మానంగా తాను భావిస్తానన్నారు. తన ప్రగతికి కేవలం తన గురువే కారణమన్నారు. మానవ ఆరోగ్యానికి సంగీతం ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఇది తనకు మరువలేని సన్మానంగా నిలుస్తుందన్నారు.

ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన ఏయూ విద్యార్థుతో ప్రత్యేక ప్రదర్శనలు అందించే విధంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసామన్నారు. ఈ కార్యక్రమం విశ్వవిద్యాలయానికి శతాబ్ది శోభను సంతరిప చేస్తోందన్నారు. ఈ సందర్భంగా కళారంగంలో ఎంతో విశేష కృషి చేసిన వారిని సత్కరించుకోవడం ఎంతో సంతోషదాయకమన్నారు. అనంతరం విశ్వవిద్యాలయం తరపున అన్నవరపు రామస్వామి గారిని సత్కరించి జ్ఞాపిక, సన్మాన పత్రం బహూకరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సరస్వతీ విద్యార్థి, సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీతలు ఏ.బి బాల కొండల రావు, మండ సుధారాణి తదితరులు ప్రసంగించారు. అనంతరం విశ్వవిద్యాలయం తరపున మండపాక శారద, హరిరామమూర్తి, జి. శారద సుబ్రహ్మణ్యం, వై.హనుమంత రావు, ఏ. బాల కొండల రావు, మండ సుధారాణిలను సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో ఏయూ ప్రిన్సిపాల్స్, డీన్లు, ఆచార్యులు, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం సంగీత, నృత్య విభాగం విద్యార్థుల శాస్త్రీయ నృత్యాలు, గానం అందరిమనసులను రంజింపచేసాయి.

## హెడ్‌ఫోన్‌తోనే అనువాదం




మీరు విదేశాలకు వెళ్లారు. అక్కడి భాష మీకు, మీ భాష వాళ్లకు తెలియదు. అయినా ఎక్కడా తడబడకుండా వారితో ముచ్చటిస్తున్నారు. ఊహించుకోవటానికే అదుతేంగా ఉంది కదా. గూగుల్ దీన్నే సుసాధ్యం చేస్తోంది. జెమినై లైవ్ ట్రాన్స్‌లేషన్ సామర్థ్యాలను హెడ్‌ఫోన్స్‌కూ జతచేయగల ఫీచర్‌ను తీసుకొస్తోంది. దీంతో మైక్రోఫోన్‌తో కూడిన హెడ్‌ఫోన్ ఏకంగా దుబాసీగా మారుతుంది. ఇది అప్పటికప్పుడు మాటలను అనువాదం చేస్తుంది. 70కి పైగా భాషలను సపోర్టు చేసే ఇది ఎలాంటి హెడ్‌ఫోన్స్‌లోనైనా పనిచేస్తుండటం గమనార్హం. ఇప్పటికే మనదేశంతో పాటు మరికొన్ని దేశాల్లో దీన్ని బీటా వర్షన్‌లో పరీక్షిస్తున్నారు. ఈ ఫీచర్ పదాలను మక్కికి మక్కి అనువాదం చేయటం కాదు.. మాట్లాడేవారి ఉద్దేశం, అర్థాన్ని గ్రహించి సమగ్రంగా అనువాదం చేయటం విశేషం. అంటే ఎదుటివారు వారి భాషలో ఏదైనా జాతీయాన్ని వాడితే దాన్ని అర్థవంతంగా మలుస్తుంది అన్నమాట. హెడ్‌ఫోన్స్‌తో జతకూడిన మొబైల్ ఫోన్‌లో గూగుల్ ట్రాన్స్‌లేట్ యాప్‌ను ఓపెన్ చేసి, లైవ్ ట్రాన్స్‌లేట్ బటన్ మీద తాకి ఈ ఫీచర్‌ను వాడుకోవచ్చు. ప్రస్తుతానికిది ఆండ్రాయిడ్ ఫోన్లకే పరిమితమని గుర్తుంచుకోవాలి.

## విశాఖలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం



**విశాఖ సమాచారం:** నగరంలో ఘనంగా వినియోగదారుల హక్కుల దినోత్సవం. World Wise Consumer Rights Association ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కులపై అద్భుతమైన సదస్సు అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత భాక్షి విచ్చేసి వినియోగదారుల చట్టాల గురించి సమగ్రమైన వివరణ ఇచ్చారు. వినియోగదారులు పూర్తి చైతన్యవంతులుగా ఉండి తాము వెచ్చించే సొమ్ముకి తగిన న్యాయం లభించిందా లేదా అని పరిశీలించుకోవాల్సిందిగా ఆయన సూచించారు. సేవల విషయంలో గాని, హక్కుల విషయంలో గాని, వస్తువుల నాణ్యత విషయంలో గాని, మన్నిక విషయంలో గాని తేడా వస్తే సహించవద్దని, వెంటనే వినియోగదారుల చట్టాన్ని వినియోగించుకుని తగిన న్యాయం పొందాలని ఆయన అందర్నీ కోరారు. ఈ కార్యక్రమాన్ని సంఘ అధ్యక్షులు రామానుజ స్వామి స్వాగతంతో ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు వక్తలు అనేక విష-విషయాలను చాలా విపులీకరించారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ ఆహార నాణ్యత విషయంలో ఎవ్వరూ ఎక్కడా రాజీ-రాజీ పడవద్దని, ప్రత్యేకంగా నగరంలో హోటళ్లు, రెస్టారెంట్లు ఇతర ఆహార పదార్థాల విక్రయదారుల దగ్గర ఎటువంటి తేడా కనిపించినా తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. అలాగే Legal Metrology Department అధికారి మాట్లాడుతూ ప్రతి వస్తువు కొనే ముందు తగినట్టుగా అది ప్యాకింగ్ చేయబడి ఉందో లేదో అలాగే సరైన తూకంలో ఉందో లేదో సరి చూసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులతో పాటు ప్రఖ్యాత సంఘ సేవకులు Doctor PK జోష్ ఎంతో ఉత్సాహంగా పాల్గొని అనేక విషయాలపై సమగ్ర వివరణ ఇచ్చారు. అంతే కాకుండా వారు వచ్చిన అతిథులలో ముఖ్యులను, అదేవిధంగా వివిధ రంగాలలో నిపుణులను ప్రత్యేకంగా సన్మానించారు. అనంతరం నిర్వాహకులంతా కలిసి Doctor PK జోష్ ను ఘనంగా సత్కరించారు.

## మద్యం కీడు శరీరమంతా..



మద్యం.. మత్తు కలిగించటంతోనే ఆగదు. మెదడు దగ్గరి నుంచి పేగుల వరకూ శరీరమంతా విపరీత ప్రభావం చూపుతుంది. తాగిన వెంటనే ఆనందం కలిగినట్టు, గాల్లో తేలుతున్నట్టు అనిపించు గానీ దీర్ఘకాలంలో తీవ్ర అనర్థాలే తెచ్చిపెడుతుంది. శరీరంలో ఇది ఏమేం చేస్తుందో తెలిస్తే ఎవరైనా మరోసారి ఆలోచించుకోక తప్పదు.

మెదడుపై సత్వర ప్రభావం

మద్యం ప్రభావం మెదడు మీద చాలా వేగంగా పడుతుంది. మొదట్లో విశ్రాంతిగా, నలుగురితో కలివిడిగా ఉన్న భావన కలుగుతుంది. కానీ రాన్రానూ మద్యం మూలంగా మెదడు ఆకృతిలో మార్పులు సంభవిస్తూ వస్తుంటాయి. సగటున రోజుకు ఒక డ్రింకు తాగినా మధ్యవయసు వారిలో, వృద్ధుల్లో మెదడు పరిణామం తక్కువగా ఉంటున్నట్టు కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. ఎంత ఎక్కువగా మద్యం తాగితే అంత ఎక్కువగా మెదడు కుంచించుకుపోతుండటం గమనార్హం. దీనికి కారణమేంటన్నది కచ్చితంగా తెలియదు గానీ మెదడుకు సంబంధించిన రోగనిరోధక వ్యవస్థను మద్యం మార్చేస్తుండొచ్చన్నది ఒక సిద్ధాంతం. ఇది వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్)ను ఉత్తేజితం చేసి, నాడీకణాలను దెబ్బతీస్తుండొచ్చని భావిస్తున్నారు.

నోటిపై నేరుగా

మద్యం తాగినప్పుడు నోరు, గొంతులోని కణజాలాలు నేరుగా ప్రభావితమవుతాయి. ఇది క్యాన్సర్లకు దారితీసే ప్రమాదముంది. మద్యం జీర్ణమయ్యే క్రమంలో అసిటలహైడ్ అనే విషతుల్య పదార్థం పుట్టుకొస్తుంది. ఇది డీఎన్ఏకు అంటుకొని కణాలను దెబ్బతీస్తుంది. ఫలితంగా నోరు, గొంతు, స్వరపేటిక, అన్నవాహిక క్యాన్సర్ల ముప్పు పెరుగుతుంది. ఒక విశ్లేషణ ప్రకారం- రోజుకు ఒక డ్రింకు తాగినా నోరు, గొంతు క్యాన్సర్ల ముప్పు 13%, అన్నవాహిక క్యాన్సర్ ముప్పు 26% మేరకు పెరుగుతుంది. ఇక రోజుకు ఐదు, అంతకన్నా ఎక్కువ డ్రింకులు తాగితే ఈ క్యాన్సర్ల ముప్పు సుమారు నాలుగు రెట్లు ఎక్కువవుతుండటం గమనార్హం.

గుండెకు హాని

ఒకప్పుడు మద్యపానం గుండెకు మేలు చేయొచ్చని శాస్త్రవేత్తలు అనుకునేవారు. కానీ పరిశోధనల ఫలితాలు వెలుగు చూస్తున్నకొద్దీ ఈ అభిప్రాయం మారిపోయింది. మద్యంతో గుండెపోటు, పక్షవాతం ముప్పులు పొంచి ఉంటున్నాయనే విషయం బలపడుతూ వచ్చింది. నిజానికి ఈ సమస్యలకూ మద్యానికీ మధ్య గల సంబంధం ఒకింత సంక్లిష్టమైందనే చెప్పుకోవచ్చు. అతిగా, అంటే రోజుకు మూడు లేదా అంతకన్నా ఎక్కువ డ్రింకులు తాగేవారికి గుండెపోటు, పక్షవాతం వచ్చే అవకాశం ఎక్కువ. అతిగా, దీర్ఘకాలంగా మద్యం తాగితే గుండె కండరం దెబ్బతింటుంది. రక్తపోటు పెరగటంతో పాటు కొలెస్ట్రాల్ కూడా ఎక్కువవుతుంది. పూడికలు ఏర్పడే ముప్పు పెరుగుతుంది. మద్యంతో గుండెలయ అస్తవ్యస్తం కావటమూ ప్రమాదాన్ని తెచ్చిపెడుతుంది. ఒక మాదిరిగా, అంటే రోజుకు రెండు డ్రింకులు, అంతకన్నా తక్కువ తాగినా గుండెపోటు, పక్షవాతం వచ్చే అవకాశం ఒకింత ఎక్కువగానే ఉంటున్నట్టు తేలింది. ఒక మాదిరిగా మద్యం తాగితే గుండెకు మేలు చేసే అవకాశముందని కొన్ని పరిశోధనలు చెబుతున్నప్పటికీ ఇందులో నిజం లేదని ఇతర అధ్యయనాలు కొట్టిపారేస్తున్నాయి.

పేగులకు పెను ప్రమాదం

నోరు, గొంతు మాదిరిగానే జీర్ణాశయం, పేగులు కూడా నేరుగా మద్యం ప్రభావానికి గురవుతాయి. అందువల్ల దెబ్బతినే అవకాశమూ ఎక్కువే. ఇది జీర్ణకోశం లోపలి గోడ వాపు, అల్సర్లు, వికారం, వాంతి వంటి సమస్యలకు దారితీస్తుంది. పేగుల్లోని సూక్ష్మక్రిములను దెబ్బతీయటం వల్ల విరేచనాలు, పోషకాలను సరిగా గ్రహించుకోలేకపోవటం వంటి సమస్యలు తలెత్తొచ్చు. పేగుల్లోంచి హాని కారకాలు రక్తంలోకి వెళ్లకుండా చూసే పొర దెబ్బతినొచ్చు. దీంతో రక్తంలోకి విషతుల్యాలు చేరుకొని, శరీరమంతా వాపు ప్రక్రియ ప్రేరేపితం కావొచ్చు. క్యాన్సర్లు సరేసరి. రోజుకు రెండు, అంతకన్నా ఎక్కువ డ్రింకులు తాగేవారికి పెద్దపేగు క్యాన్సర్ వచ్చే అవకాశం 25% వరకూ ఎక్కువగా ఉంటున్నట్టు ఒక తాజా అధ్యయనంలో బయటపడింది.

కాలేయం కకావికలం

మద్యం మూలంగా దెబ్బతినే అవయవాల్లో ప్రధానంగా చెప్పుకోవాల్సింది కాలేయమే. మద్యంతో ముడిపడిన కాలేయ జబ్బు ఎంతోమందిని కబళిస్తోంది. రక్తంలో కలిసిన మద్యాన్ని వడగట్టేది కాలేయమే. దీన్ని వడగడుతున్న ప్రతిసారీ కొన్ని కాలేయ కణాలు చనిపోతుంటాయి. నిజానికి కాలేయం కొత్త కణాలను పుట్టించుకుంటుంది. కానీ అదేపనిగా మద్యం ఎక్కువగా తాగుతుంటే క్రమంగా ఈ సామర్థ్యం తగ్గుతూ వస్తుంది. ఇది తీవ్రంగా, శాశ్వతంగా కాలేయం దెబ్బతినటానికి దారితీస్తుంది. మద్యం అలవాటు గలవారికి కాలేయ కణాల్లో కొవ్వు పోగుపడటం, కాలేయం వాపు (హెపటైటిస్), కాలేయం గట్టిపడటం (సిరోసిస్) ముప్పు ఎక్కువ. ఒక అంచనా ప్రకారం- రోజుకు నాలుగు డ్రింకుల కన్నా ఎక్కువ మద్యం తాగేవారిలో 90% మందికి కాలేయంలో కొవ్వు పోగుపడుతోంది. రోజుకు మూడు, అంతకన్నా ఎక్కువ డ్రింకులు తాగేవారిలో 30% మంది కాలేయ వాపు బారినపడుతున్నారు. జాగ్రత్త పడితే తొలిదశలో ఇలాంటి సమస్యలను వెనక్కి మళ్లించుకోవచ్చు. కాలేయం గట్టిపడటం తీవ్రమైతే మాత్రం కోలుకోవటం కష్టం. కథ ఇంతటితోనే అయిపోలేదు. అతిగా మద్యం తాగితే కాలేయ క్యాన్సర్ల ముప్పూ ఎక్కువవుతుంది.

# గోదావరి జిల్లాల సమాచారమ్

## కామాంధులకు కటకటాలు



కడియం,కంబాలచెరువు (రాజమహేంద్రవరం) : బిడ్డల భవిష్యత్తును ఉన్నతంగా ఊహించుకుని ఉపాధికోసం ఊరు కాని ఊరొచ్చిందా కుటుంబం. ఆ ఇంటికి దీపమైన ఇల్లాలిని కర్కశంగా చిదిమేసిన కామాంధులకు రాజమహేంద్రవరం ఎనిమిదో అదనపు జ్యుడిషియల్ కోర్టు జీవితఖైదు విధించింది. 2024 అక్టోబరులో జరిగిన ఈ అమానవీయ ఘటన అప్పట్లో కలకలం రేపింది. బాధిత

**కుటుంబానికి సర్కారు భరోసా**

నాడు వివాహిత అత్యాచారం, హత్య ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబం పక్షాన నిలిచింది. పరిహారంగా రూ.5 లక్షలు, దోషాలమ్మకాలనీలో రెండు సెంట్ల స్థలం మంజూరు చేసింది. దివ్యాంగురాలైన ఆమె కుమార్తెకు నిడదవోలులోని పునరావాస కేంద్రంలో ఆశ్రయం కల్పించారు. కుమారుడికి డిగ్రీ పూర్తి చేశాక ఉద్యోగం కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాజమహేంద్రవరం గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి హామీ ఇచ్చారు. 2024 అక్టోబరు 15న.. ఆ రోజున మృతురాలైన మహిళ(43) డ్వాక్రాకు సంబంధించిన పని ముగించుకుని నర్సరీలో పనులు చేస్తుండగా బుర్రిలంకకు చెందిన దేవర యేసు(26), వి.ప్రవీణ్(21), లోకిన జయప్రసాద్(19), పొట్టిలంకకు చెందిన దాసరి సురేష్(22) మద్యం మత్తులో ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడి హత్య చేశారు. మృతదేహాన్ని పక్కనే కాలువలో విసిరేశారు. ఆమె మృతదేహం రెండు రోజుల తరువాత చొప్పెల్ల లాకుల వద్ద కనిపించింది.

**అకృత్యంతో ఆశలు సమాధి..**

కుమార్తె మానసిక దివ్యాంగురాలు. ఎంత వయసు వచ్చినా.. ఆమె ఆలనాపాలనా అంతా అమ్మే చూడాలి. కుమారుడు డిగ్రీ చదువుతున్నాడు. అతడికి తల్లే అన్నీ సమకూర్చాలి. ఇంటి బాధ్యతను ఇంతలా మోస్తున్న ఆ ఇంటామె అంటే ఒడిశా నుంచి వచ్చి బుర్రిలంకలో బతుకు బండి లాగుతున్న భర్తకు ఎంతో ప్రేమ. నలుగురు కామాంధుల లైంగిక దాడి.. ఆపై చంపేయడంతో బిడ్డలు తల్లిని, భర్త తన భార్యను కోల్పోయారు.

## కాకినాడ జిల్లాలో 80.600 కి.మీ మేర జాతీయ రహదారి విస్తరణ



కాకినాడ : జిల్లాలోని ఎనిమిది మండలాల మీదుగా వెళుతున్న 16వ నంబరు జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించడానికి అడుగులు పడుతున్నాయి. ప్రస్తుతం నాలుగు వరసలుగా ఉన్న ఈ రహదారిని అనకాపల్లి-అన్నవరం-దివాన్‌చెరువు మధ్య విస్తరణకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చర్యలు చేపట్టింది.

**ఎనిమిది మండలాల పరిధిలో..**

కాకినాడ జిల్లాలోని తుని, తొండంగి, శంఖవరం, ప్రత్తిపాడు, గొల్లప్రోలు, ఏలేశ్వరం, జగ్గంపేట, గండేపల్లి మండలాల పరిధిలో ఆరు వరుసలుగా విస్తరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లోనే గృహాలు, ఇతర నిర్మాణాలు తొలగించాల్సి ఉంటుంది. చాలాచోట్ల భూసేకరణకు ఇబ్బంది ఉండదని భావిస్తున్నారు.

ప్రజాప్రతినిధుల నుంచి అభిప్రాయాల సేకరణ

జిల్లాలో ఈ రహదారి విస్తరణ నేపథ్యంలో కలెక్టర్ షాన్‌మోహన్ జాతీయ రహదారి విభాగం అధికారులతో కలిసి ఇటీవల నిర్వహించిన సమావేశంలో ప్రజాప్రతినిధుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చర్చించారు. సర్వీసు రోడ్లు నిర్మించాలని, పైవంతెనలు ఏర్పాటు చేయాలని, అండర్‌పాస్‌లు నెలకొల్పాలని, గృహాలు, ఇతర నిర్మాణాలకు పెద్దగా నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు సూచించారు. దీనిలో రెవెన్యూ, ఆర్అండ్‌బీ, సర్వే, విద్యుత్తు, జలవనరులు, బీఎస్ఎన్ఎల్, ఓఎన్జీసీ, బీపీసీఎల్, ఆర్‌డబ్ల్యూఎస్, ఉద్యానశాఖ, దేవాదాయశాఖ, కాలుష్య నియంత్రణ మండలి, డ్రెయిన్ల విభాగం, పంచాయతీరాజ్ తదితర శాఖ పాల్గొన్నారు. దీని ప్రకారం నివేదిక సమర్పించారు.

**సంయుక్త సర్వే**

ఈ రహదారి విస్తరణకు సంబంధించి డీపీఆర్ రూపకల్పనకు కన్సల్టెన్సీని నియమించారు. ఆర్కి టెక్నో, ధ్రువ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ సంస్థలకు బాధ్యతలు అప్పగించారు. ఈ రెండు సంస్థలు సంయుక్తంగా సర్వే నిర్వహించి, డీపీఆర్‌ను తయారు చేసి, ఎన్‌హెచ్‌ఏఐకు నివేదించనుంది. డీపీఆర్ ఆమోదం తర్వాత భూసేకరణ ప్రక్రియ చేపడతారు. దీనిపై డీఆర్వో తిప్పేనాయక్‌ను సంప్రదించగా కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించి, అభిప్రాయాలు సేకరించామని చెప్పారు.

**జిల్లాల వారీగా వివరాలు (కి.మీ.లలో)**

మొత్తం పొడవు : 161.745
కాకినాడ పరిధి : 80.600
అనకాపల్లి : 68.645
తూర్పుగోదావరి : 11

## పట్టుకోవడానికి శ్రమిస్తున్న అధికారులు



ప్రత్తిపాడు, శంఖవరం, ఏలేశ్వరం : రాయల్ బెంగాల్ టైగర్.. ఓసారి పట్టుబడి అడవిలోకి వదిలినా.. మళ్లీ ఊళ్లలోకే వచ్చింది. వన్యప్రాణుల కన్నా.. పాడి పశువుల వేటకే అలవాటుపడింది. ఫిబ్రవరి 6న రాయవరం మండలం కూర్మాపురంలో బంధించి ఎక్స్‌ప్లోరర్ అని నామకరణం చేసి ఫిబ్రవరి 14న పాపికొండల్లో విడిచిపెట్టారు. అక్కడ అట్టేకాలం ఉండలేకపోయింది. మళ్లీ గత నెల 22న పాపికొండల నుంచి మారేడుమల్లి మండలం రామన్నవలస ప్రాంతానికి చేరింది. తర్వాత రంపచోడవరం మండలం పెదగడ్డాడ, చెరువుపాలెం, రంప, మర్రివాక, తాళ్లపాలెం, గంగవరం మండలం మొల్లేరు మల్లవరం అడ్డతీగల మండలం తిమ్మాపురం, 516 హైవే సమీపంలోని కోనలోవ, గొండోలు మీదుగా ఏలేశ్వరం మండలం మర్రివీడు, పరిమితడక వద్ద కాకినాడ జిల్లాలోకి వచ్చింది.

**వాహనంపై గాలిస్తున్న సిబ్బంది**

ధారపల్లి జలపాతం వద్ద సంచరించిన వ్యాఘ్రం పది రోజులుగా ప్రత్తిపాడు నియోజకవర్గంలోనే తిష్ఠ వేసింది. శంఖవరం మండలం గౌరంపేట కొండపైకి చేరిన వ్యాఘ్రం దాదాపు 200 కి.మీ. ప్రయాణించింది. 40కి పైగా గ్రామాలు పులి భయంతో వణుకుతున్నాయి. ఎక్కడ తిరుగుతోందో తెలిసేలా కాలర్ బెబ్బులి మెడకు ఉంది. రెండు రోజుల్లో పట్టేస్తామని యంత్రాంగం చెబుతోంది. జి.కొత్తపల్లి సమీపంలో సమీక్షిస్తున్న పీసీసీఎఫ్ డా.పీవీ చలపతిరావు, చీఫ్ కన్జర్వేటర్ శ్రీకంఠనాథరెడ్డి, డీఎఫ్‌వో రామచంద్రరావు తదితరులు

**హనుమాన్ బృందాల రాక**

మూడేళ్ల వయసున్న ఈ పులి.. ఊళ్లలో తిరగడానికి ఇష్టపడుతోంది. దీనిని పట్టుకునేందుకు హనుమాన్ బృందాలతో పాటు 100 మందిని నియమించారు. పీసీసీఎఫ్ డా.పీవీ చలపతిరావు స్వయంగా ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్నారు. చీఫ్ కన్జర్వేటర్ శ్రీకంఠనాథరెడ్డి, డీఎఫ్‌వో రామచంద్రరావు నేతృత్వంలో యంత్రాంగం పులిని అనుసరిస్తోంది. ఆవులను వేటాడడంపై మక్కువ చూపుతూ పది పశువులపై పంజా విసిరింది. సహజంగా వేటాడిన పశువును మర్నాడు వచ్చి తినడం పులి నడత! ఇందుకు భిన్నంగా వేటాడి వదిలేసి వెళ్లడానికి అలవాటు పడింది. బెబ్బులికి అనువైన పరిస్థితులు ఉపప్రణాళిక మన్యంలో సానుకూలంగా ఉండటంతో పాటు పశువుల మాంసం రుచిమరిగి ఇక్కడిక్కడే తిరుగుతోంది.



## శుభకార్యాలపై గ్యాస్ పిడుగు



అమలాపురం కలెక్టరేట్: గోదావరి జిల్లాలో శుభకార్యాల్లో భోజనాలకు ఎంతో పేరుంది. ఎన్ని రకాల వంటకాలతో అతిథులకు విస్తరి వేస్తే అంత ఘనంగా పెళ్లి నిర్వహించినట్లు జిల్లా వాసులు భావిస్తారు. తాజా పరిణామాలతో పలు రకాల వంటకాలు వండి వడ్డించడం అసాధ్యంగా మారింది. జిల్లాలో వివాహాలు, గృహ ప్రవేశాలు, వ్యాపార ప్రారంభోత్సవాలు, నిశ్చితార్థాలు, నూతన గృహాలకు శంకుస్థాపనలు ఇలా వివిధ శుభకార్యాలకు ముహూర్తాలు ఉన్నాయి. గల్ఫ్‌లో యుద్ధం కారణంగా గ్యాస్‌కు తీవ్ర కొరత ఏర్పడింది. ఇప్పటికే నిశ్చయించుకున్న శుభకార్యాలకు నిర్వాహకులు బంధు మిత్రులను పిలిచేశారు.

గ్యాస్ సమకూర్చుకోండి

ప్రస్తుతం ఎక్కడ చూసినా పెళ్లిళ్ల సీజన్ నడుస్తోంది. విందులో వడ్డించే వంటకాల తయారీ నిర్వాహకులకు పెద్ద సమస్యగా మారింది. గ్యాస్ సిలిండర్లు మీరు సమకూర్చుకుంటే వంటల పని చేసిపెడతామని క్యాటరింగ్ వాళ్లు తేల్చి చెబుతున్నారు. గృహ అవసరాల సిలిండర్ (14.2) కిలోల ధరల అధికారికంగా రూ.968 అయినప్పటికీ బయట మార్కెట్‌లో రూ.1300 నుంచి రూ.1500 వరకు పలుకుతోంది. ఆ మొత్తం చెల్లించేందుకు సిద్ధపడుతున్నా.. ఒకటి రెండు తప్ప దొరకడం లేదు. 2వేల మంది అతిథులకు వంట చేయాలంటే కనీసం 5 నుంచి 6 సిలిండర్లు అవసరం అవుతాయి. రావులపాలెం ప్రాంతానికి చెందిన ఓ హోటల్ వారికి పెళ్లి రోజు సాయంత్రం 10 రకాల లైవ్ టిఫిన్స్ పెట్టే విధంగా నెల క్రితం రూ.2 లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. మీరు గ్యాస్ సమకూర్చుకుంటే తప్ప ఆ రోజు టిఫిన్స్ ఏర్పాటు చేయలేమని వారు తాజాగా చెప్పడం గమనార్హం.

వంటవారికి అదనపు ఖర్చు

వేసవి నేపథ్యంలో కట్టెల పొయ్యి నుంచి వచ్చే వేడి, పొగ వల్ల కష్టంగా ఉంటోందని, కొంత అదనపు మొత్తం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మరో వైపు కల్యాణ మండపాల నిర్వాహకులు తమ మండపాలలో కట్టెల పొయ్యిలపై వంటలు చేసేందుకు అంగీకరించడం లేదు.

## పట్టణ ప్రణాళిక వ్యవహారాలపై కొనసాగుతున్న అనిశా విచారణ



రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, : రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ప్రణాళిక విభాగంలో చోటు చేసుకున్న అక్రమాలపై అనిశా విచారణ వేగవంతం చేసింది. అనధికార నిర్మాణాలు, అనుమతుల మంజూరుపై ఇప్పటికే వివరాలు సేకరించారు.దీనికి సంబంధించి 688 దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది జనవరి 27 నుంచి ఇప్పటి వరకూ అనుమతులు పొందిన వాటిపై దృష్టి సారించారు. అక్రమ భవంతుల నిర్మాణాలను గుర్తించే ప్రక్రియలో భాగంగా వీటికి ఎవరు సంతకాలు.చేశారు.. ఎందుకు అనుమతులిచ్చారు.. అనే కోణంలో విచారణ చేస్తున్నారు.సంబంధిత అధికారుల నుంచి వివరణ తీసుకుంటున్నారు. భవన అనుమతులకు సంబంధించి ఆన్‌లైన్ విధానం అమల్లో ఉంది. ఈ ప్రక్రియలో సచివాలయం సర్వేయర్‌తోపాటు పట్టణ ప్రణాళిక అధికారులూ భాగస్వాములయ్యారు. ఇప్పటికే నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను గుర్తించారు.

**బీపీఎస్ అమల్లో ఉన్నా..**

అనధికార భవనాల అనుమతుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా బీపీఎస్‌ను తెరపైకి తెచ్చింది. గత నాలుగైదు నెలలుగా దరఖాస్తులు వచ్చినప్పటికీ ఆశించినంతగా పూర్తి చేయడం లేదు. ఇప్పటి వరకూ బీపీఎస్‌లో 1869 దరఖాస్తులు రాగా 22 వాటికి మాత్రమే అనుమతులు మంజూరు చేశారు. మిగిలినవి పరిశీలనలోనే ఉన్నాయి. వాటిపై ఏసీబీ పట్టు బిగిస్తోంది. భవన యజమానులు ముందుకు వచ్చి అనధికార నిర్మాణాలను సరి చేసుకొనేందుకు ఆసక్తి చూపినా.. సిబ్బంది ఎందుకు దరఖాస్తులను పూర్తి చేయలేకపోతున్నారనే దానిపై విచారణ చేస్తోంది. నిబంధనల ప్రకారం బీపీఎస్‌లో దరఖాస్తు చేసుకోగానే ప్రణాళికా విభాగం అధికారులు క్షేత్ర స్థాయిలో నిర్మాణాన్ని పరిశీలించి అపరాధ రుసుము విధిస్తారు. సొమ్ము చెల్లించిన తర్వాత భవన అనుమతుల క్రమబద్ధీకరణ పూర్తి చేస్తారు. ఈ ప్రక్రియ వేగవంతం చేయడం ద్వారా అటు ప్రభుత్వానికి ఆదాయంతోపాటు, అనధికార నిర్మాణాలు సక్రమం అవుతాయి. ఈ విధానంపై అధికారులు కాసులకు ఆశపడి చాలా మందిని కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఒక అడుగు ముందు కేసి నేరుగా భవన యజమానులను సంప్రదిస్తుండటం గమనార్హం. వారు ఇచ్చే ఆధారాలకనుగుణంగా అధికారులను పిలిపించి విచారణ చేస్తున్నారు. పూర్తి స్థాయి విచారణ తర్వాత నివేదికను ఉన్నత అధికారులకు అందించనున్నారు.

## ప్రమాదంలో మృతిచెందిన కుమార్తె నేత్రాలు దానం



తుని : మహాలక్ష్మి కన్న కలలు చెదిరాయి.. పుట్టెడు దుఃఖంలోనూ ఆమె కుటుంబసభ్యులు గొప్ప నిర్ణయం తీసుకున్నారు. ఆమె నేత్రాలను మరొకరికి దానం చేయాలనుకున్నారు. వివరాలివీ..విశాఖలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తుని పట్టణం గవరపేటకు చెందిన ఆడారి కుసుమ మహాలక్ష్మి (19) మృతి చెందిన విషయం విదితమే. ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది మహాలక్ష్మి కంటి రెటీనా సేకరించారు. మృతదేహానికి కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి, సోమవారం అంత్యక్రియలు పూర్తి చేశారు.

**ప్రభుత్వ కొలువు సాధించాలనే తపన**

తుని జడ్పీహెచ్ఎస్‌లో పాఠశాల చదువులు పూర్తి చేశాక, కాకినాడలో పాలిటెక్నిక్ చదివిన మహాలక్ష్మి, తన స్నేహితురాలు అనూష, మరికొందరితో కలిసి విశాఖలోనే ఉంటూ ఓ కంపెనీలో ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు. తండ్రి సత్యనారాయణ రోజువారీ పనులు చేసుకుంటుండగా, తల్లి నూకలక్ష్మి గృహిణి. అన్న అఖిల్ డిగ్రీ చదువుతున్నాడు. చదువులో ఎంతో శ్రద్ధాశక్తులు ప్రదర్శిస్తూ, ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపన ఉండేదని తండ్రి సత్యనారాయణ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఇంటర్న్‌షిప్ పూర్తిచేశాక చెన్నైలోని ఓ కంపెనీలో ఉద్యోగం చేయడానికి కూడా ఏర్పాట్లు చేసుకుందని వాపోయారు.

## డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యకేసులో తాజా పరిస్థితి

కాకినాడ: దళిత యువకుడు, డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్యకేసు దర్యాప్తు దాదాపు పూర్తయింది. 2022 మే 19న జరిగిన ఈ హత్యలో ఏ1 వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు కాగా, ఏ2 ఆయన భార్య లక్ష్మీదుర్గ అలియాస్ రోజా.. నాడు సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో అనంతబాబు గతంలోనే కొన్నాళ్లు జైలు జీవితం గడిపి తర్వాత బెయిల్‌పై వచ్చి తిరుగుతున్నారు. ఆయన భార్య లక్ష్మీదుర్గను విచారించాలని ఇటీవల పోలీసులు ప్రయత్నించినా ఆచూకీ దొరకలేదు. ముందస్తు బెయిల్ కోసం





హైకోర్టులో పిటీషన్ వేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారామె. ఇటీవల కోర్టులో ఆమెకు వ్యతిరేకంగా తీర్పురావడంతో ఇన్నాళ్లు కలుగులో ఉన్న ఆమె పోలీసులు ఎదుట హాజరుకాక తప్పలేదు. కాకినాడ ఎస్‌డీపీవో కార్యాలయంలో సోమవారం జరిగిన విచారణకు అనంతబాబు దగ్గరుండి ఆమెను కారులో దిగబెట్టి వచ్చారు. మీడియా కంటపడకుండా జాగ్రత్తపడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన విచారణలో మొక్కుబడి సమాధానాలే తప్ప పోలీసులు అడిగిన ప్రశ్నలకు ఒక్కటీ ఆమె సక్రమంగా చెప్పలేదని తెలిసింది. ఆమె తీరు చూస్తే విచారణకు సహకరించే పరిస్థితి కనిపించడం లేదని, అందుకే ఈనెలాఖరు వరకు కొనసాగించాలని పోలీసులు నిర్ణయించినట్లు సమాచారం. సుబ్రహ్మణ్యం హత్యకేసులో ఆమె ప్రమేయంపై తమ వద్ద సాంకేతిక ఆధారాలు చాలా ఉన్నాయని, వాటిని కోర్టులో ప్రవేశపెడతామని పోలీసులంటున్నారు.

## గ్యాస్ సిలిండర్లకు ప్రత్యామ్నాయంపై దృష్టి



మామిడికుదురు : పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో వాణిజ్య రంగానికి ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా నిలిపివేసిన నేపథ్యంలో ప్రస్తుతం దేవాలయాల్లో వంటలపై ప్రభావం చూపుతోంది. నిత్యం వేలాది మంది భక్తులకు అన్నదానం, స్వామివారి నివేదనకు ప్రసాదాల తయారీకి అవసరమైన గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడడంతో ప్రత్యామ్నాయంపై అధికారులు దృష్టి సారించారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి, అప్పనపల్లి బాలబాలాజీస్వామి, అంతర్వేది లక్ష్మీనృసింహస్వామిసహా 12 ప్రధాన దేవస్థానాల్లో భక్తులకు నిత్యాన్నదాన కార్యక్రమం జరుగుతోంది. రోజూ సుమారు 15 వేల మంది భక్తులు భోజనాలు చేస్తుంటారు. బూరె, లడ్డూ ప్రసాదం తయారీతోపాటు స్వామివారికి నివేదనకు ఆలయాల వద్ద ప్రత్యేకంగా వంటశాలలున్నాయి. వీటికి నెలకు 60 గ్యాస్ సిలిండర్ల వరకు ఉపయోగిస్తున్నారు. అన్నం, ఇతర కూరల తయారీకి జీడిపిక్కల పొట్టుతో మండే పొయ్యిలున్నాయి. మిగతా వాటికి కచ్చితంగా గ్యాస్ సిలిండర్లు అవసరమున్నందున ఈ సమస్యను ఎలా అధిగమించాలన్న అంశంపై దేవస్థానం అధికారులు తర్జనభర్జనలు పడుతున్నారు. పొట్టుతో మండే పొయ్యిలు, సౌరశక్తి, నీటిని వేడి చేసి ఆవిరిగా మార్చే బాయిలర్లను ఉపయోగించడం ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి పెట్టామని దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

## ఐక్యత చాటేందుకు క్రీడలు దోహదం

కాకినాడ క్రైం: ఐక్యత చాటేందుకు క్రీడలు దోహదపడతాయని డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ విశ్రాంత వీసీ, రాష్ట్ర విశ్రాంత డీఎంఈ డాక్టర్ కొరుకొండ బాబ్జీ అన్నారు. ఆదివారం కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల మైదానంలో నిర్వహించిన డాక్టర్ ఎన్టీఆర్ యూహెచ్ఎస్ క్రికెట్ మెన్స్ పీజీల టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగింది. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్ పర్యవేక్షణలో నిర్వహించిన క్రీడా పోటీల ముగింపు వేడుకకు డాక్టర్ బాబ్జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హోరాహోరీగా తలపడిన తుది పోరులో తిరుపతికి చెందిన శ్రీవెంకటేశ్వర మెడికల్ కాలేజ్ బృందం విజేతగా నిలువగా, కాకినాడ రంగరాయ టీమ్ రన్నర్ స్థానం దక్కించుకుంది. కర్నూలు వైద్య కళాశాల, అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలు మూడో స్థానంలో నిలిచాయి. అనంతరం ముగింపు వేడుకల్లో డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ, విద్యార్థుల మధ్య దూరాల్ని చెరపి, ఐక్యత పెంచేందుకే యూనివర్సిటీ క్రీడలు నిర్వహిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో 20కి పైగా కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు రంగరాయ ఆతిథ్యమివ్వడం గర్వకారణమన్నారు. మూడు రోజుల పాటు కొనసాగిన టోర్నమెంట్ నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన ఆర్ఎంసీ పీడీ గొల్లపల్లి లక్ష్మణరావు సహా డాక్టర్ ఎన్టీఆర్ యూహెచ్ఎస్ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ త్రిమూర్తి, ఆర్ఎంసీ మెడికో వలంటీర్లు ఎం.మోహన్ అప్పారావు, ఎస్కే మౌలాలి, యశ్వంత్, వినయ్, వసుధ, సాయి శ్వేత, శ్వేత, హర్షిణి తదితరులను డాక్టర్ విష్ణువర్ధన్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విజేతలకు మెడల్స్, ట్రోఫీలను అందజేశారు. ఆర్ఎంసీ స్పోర్ట్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జీఎస్ ముఖర్జీ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శశి తదితరులు పాల్గొన్నారు.

## అభ్యుదయ కవిత్వం అవసరం

అంబాజీపేట: కవులు సామాజిక చైతన్యం, అభ్యుదయ భావాలతో కవిత్వం రాయాలని అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక సీఈఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. ఆదివారం అంబాజీపేట పెద్ద వీధిలోని ఏవీఆర్, యర్రాప్రగడ సూర్య ప్రకాశరావు కల్యాణ మండపంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో 165వ శతాధిక కవి సమ్మేళనం జరిగింది. చైతన్య సారస్వత పరిషత్, శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రతాప్ మాట్లాడుతూ నేటి సమాజంలోని కవులు అక్షర శిల్ప నైపుణ్యంతో కవితాత్మకంగా వాస్తవ రూప వైవిధ్యం చూపించినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. సామాజిక అభివృద్ధికి సహాయపడే సాహిత్యమంతా అభ్యుదయ సాహిత్యం అవుతుందన్నారు. అంబాజీపేట గురజాడ సేవా సమితి అధ్యక్షుడు అరిగెల బలరామమూర్తి మాట్లాడుతూ శ్రీశ్రీ కళావేదిక జాతీయ స్థాయిలో 165వ కవి సమ్మేళనం నిర్వహించి, తెలుగు సాహిత్య చరిత్రలో కొత్త చైతన్యంతో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ తెలుగు సాహిత్యానికి వెలుగు నింపుతున్నారన్నారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి టి.పార్థసారథి మాట్లాడుతూ సామాజిక చైతన్యాన్ని రగిలించే కవితల సాధన చేయాలన్నారు. ఏపీ ప్రత్యేక రక్షణ దళం కమాండెంట్ రత్నకొండా నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులు మాట్లాడుతూ శ్రీశ్రీ కళావేదిక సీఈఓ ప్రతాప్ చేస్తున్న సేవలను కొనియాడారు. జిల్లా కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, వెంకట్ పొలమూరితో పాటు సుమారు 150 మంది కవులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. అనంతరం కిమ్స్ వైద్య కళాశాల వైస్ చైర్మన్ మోహన్‌రాజు, వీఆర్వో రాధామనోహర్‌లను ప్రతాప్, కొండ నరసింహారావు, కావూరి శ్రీనివాసశర్మ ఘనంగా సన్మానించారు. జాతీయ శతాధిక ఉగాది కవి సమ్మేళనంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల నుంచి పాల్గొన్న సుమారు 150 మంది కవులు ఉగాది కవి సమ్మేళనంలో తమ కవితల ద్వారా అక్షర విందును అందించారు. కళావేదిక అధ్యక్షులు నల్లా నరసింహమూర్తి, పేరి కామేశ్వరరావు, నర్సిపల్లి హారిక తదితరులు పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్

పి.గన్నవరం: మోటారు సైకిల్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో అన్నయ్య మృతి చెందగా, చెల్లెలితో పాటు ఆమె ఇద్దరు కుమారులకు తీవ్ర గాయాలు కాగా, కుమార్తె సురక్షితంగా బయటబడింది. ఆ ఐదుగురూ మోటారు సైకిల్‌పై పి.గన్నవరం వస్తుండగా ఈ ఘటన జరిగింది. ఎస్సై బి.శివకృష్ణ కథనం ప్రకారం.. పి.గన్నవరం శివారు చింతపల్లి వారిపేటకు చెందిన చింతపల్లి శ్రీలక్ష్మి ఇటీవల అనారోగ్యానికి గురైంది. దీంతో ఆమె సోదరుడు నగరం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ బళ్ల సురేంద్ర కుమార్ (45) ఈ నెల 13న చెల్లెలు ఇంటికి వచ్చాడు. శ్రీలక్ష్మిని, ఆమె కుమారులు అభినయ్ (10), అవినాష్ (6), కుమార్తె లహరిలను నగరం గ్రామంలోని తన ఇంటికి తీసుకువెళ్లాడు. సోమవారం పిల్లలను పాఠశాలకు పంపాలన్న ఉద్దేశంతో చెల్లెలు శ్రీలక్ష్మి తన ఇంటికి వెళ్లిపోతానని చెప్పింది. దీంతో సురేంద్ర కుమార్ ఆదివారం సాయంత్రం చెల్లెలిని, పిల్లలను నగరం నుంచి మోటారు సైకిల్‌పై పి.గన్నవరం తీసుకు వస్తున్నాడు. మొండెపులంక శివారు జొన్నల్లంక ప్రాథమిక పాఠశాల సమీపంలో చాకలిపాలెం వైపు వెళ్తున్న ట్రాక్టర్ వీరి మోటారు సైకిల్‌ను ఎదురుగా వచ్చి ఢీకొంది. సురేంద్ర కుమార్‌కు ట్రాక్టర్ తగిలి రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతడిని ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. శ్రీలక్ష్మి, అభినయ్, అవినాష్‌ల కుడికాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. లహరి స్వల్ప గాయాలతో బయటపడింది. వీరి వెనుక మోటారు సైకిల్‌పై వస్తున్న మరో నలుగురు వ్యక్తులు కూడా ప్రమాదానికి గురయ్యారు. అయితే వారిలో నాలుగేళ్ల పాప తుప్పల్లో పడిపోవడంతో ఆమెకు మాత్రమే స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న పి.గన్నవరం ఎస్సై శివకృష్ణ తన సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకుని క్షత గాత్రులను అంబులెన్స్‌లో స్థానిక సీహెచ్‌సీ తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం తల్లీ, ఇద్దరు కుమారులను వేర్వేరు అంబులెన్స్‌ల్లో అమలాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

**ఆస్పత్రి వద్ద బంధువుల రోదన**

రోడ్డు ప్రమాదంలో నగరం గ్రామానికి చెందిన సురేంద్రకుమార్ మృతితో పి.గన్నవరం సీహెచ్‌సీ వద్ద అతని కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. మృతుడి భార్య వరలక్ష్మి ఐదు నెలల క్రితం జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లింది. అతనికి కుమారుడు భానుప్రకాష్, కుమార్తె శిరీష ఉన్నారు. ఆస్పత్రి వద్ద కుమారుడు విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. ఇరాన్ యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో మృతుడి భార్య వరలక్ష్మి భర్తను కడసారి చూసేందుకు అవకాశం ఉంటుందో లేదోనని బంధువులు వాపోతున్నారు. ప్రమాదంలో తీవ్ర గాయాలైన చెల్లెలు శ్రీలక్ష్మికి అన్న మరణించాడన్న విషయం తెలియదు. దీంతో ఆస్పత్రిలో ఉన్న శ్రీలక్ష్మి అన్నయ్యకు ఎలా ఉందని అడిగిన తీరు అందరి హృదయాలను కలచివేసింది.

# కల్పనా చావ్లా జయంతి

**పైడిమెట్ట, విశాఖ సమాచారం:** మండల పరిషత్ బేసిక్ ప్రాథమిక పాఠశాల పైడిమెట్ట నందు మంగళవారం భారతదేశపు మొట్ట మొదటి అంతరిక్ష యాత్రికురాలు కల్పనా చావ్లా జయంతి నిర్వహించబడినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దున్నా దుర్గారావు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కల్పన చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయులు దున్నా దుర్గారావు ఆమె గురించి వివరించారు. ఈమె హర్యానా రాష్ట్రంలో 1962 మార్చి 17న పుట్టింది. తండ్రి టైర్ల వ్యాపారి. కల్పన చిన్నతనం నుండే అంతరిక్షంలో విహరించాలనే కలలు కనేది. ఉదయం 4 గంటలకే బయలుదేరి పాఠశాలకు వెళ్ళేది. ఆ వయసులో అందరూ బార్బీ బొమ్మలతోను, కామిక్ పుస్తకాలతోను ఉంటే కల్పన విమానం బొమ్మలు వేస్తూ ఉండేది. 7వ తరగతి చదువుతుండగానే అంతరిక్ష సంస్థ నాసా వారిచే సెలెక్టు కాబడింది. బాగా చదుకుని అంతరిక్ష యాత్రికురాలుగా ఎదిగింది. ఈమె అంతరిక్షంలోకి వెళ్లిన భారత సంతతికి చెందిన మొట్ట మొదటి మహిళా వ్యోమగామి అని అన్నారు. ఈమె స్ఫూర్తితో నేటి తరం విద్యార్థులు అంతరిక్ష జ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహోపాధ్యాయులు ధర్మాన రాము, విద్యార్థులు, సిఆర్ఎంటి పద్మావతి ఉన్నారు.

# కరెంటు తీగలు తగిలి కాఫీ మిర్యాల రైతు మృతి...



**అరకు లోయ (విశాఖ సమాచారం)** అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రి గుడా మండలం గుంట గన్నేల పంచాయతీ పిత్త గుడా గ్రామానికి చెందిన కిల్లో బలరాం 49 సంవత్సరలు ఈ రోజు ఉదయం మిరియాలు కోయడానికి నిచ్చెన పట్టుకొని తోటకూ వెళుతున్న సమయంలో నిచ్చెన కరెంట్ వైర్ కు తగిలి,విద్యుత్ షాక్ తో అక్కడిక్కాకడె మృతి చెందారు. మృతి చెందిన బలరాం కుటుంబానికి తక్షణమే 10 లక్షలు నష్ట పరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి. అలాగె కాఫీ మిరియాలు రైతులకు ప్రత్యక్షంగా ఇన్సూరెన్సు చదుపాయం కల్పించాలి. కాఫీ రైతులకు సేఫ్ గర్డ్స్ లేక చెట్టు నుండి పడిపోవడం,పాము కాటుకు, వన్య ప్రాణులు నుండి దాడులు ఎదుర్కొని తోట పనులు చేస్తున్నారు. ప్రమాద వసత్తు ఇటువంటి సంఘటనలు జరిగిన్నప్పుడు మృతి చెందిన కుటుంబానికి భారం అవుతున్నారు. అరకు ఆర్గానిక్ కాఫీ, మిరియాలకు విదేశాల్లో మంచి పేరు ప్రఖ్యతలు కలిగి ఉంది.అంత గిరాకీ ఉన్న ఇక్కడ కాఫీ, మిరియాలు పండించే రైతులకు మాత్రం ప్రభుత్వం భరోసా కల్పించే ఎటువంటి చర్యలు తీసుకోక పోవడం బాధాకరం, రోజు కాఫీ రైతులు ఏదొక ప్రమాదంతో మరణిస్తూ ఉన్నారు. రైతులకు చెల్లించాల్సిన ప్రోత్సహక నిధులు ఇప్పటికి చెల్లించడం లేదు. ఒక వైపు కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో కాఫీ తోటలా అభివృద్ధికి కోట్లు ఖర్చు చేస్తున్నాము.అని ప్రకటనలు చేస్తున్నారు. సంవత్సరల తరబడి రైతులకు చెల్లించాల్సిన కోట్ల రూపాయలు పెండింగ్ ఉంటే, విడుదల చేసిన డబ్బులు ఎవరి జేబులోకి వెళుతున్నాయో అర్ధం కాని పరిస్థితి రైతుల్లో వ్యక్తం అవుతుంది. అనేక మార్లు కాఫీ రైతులకు, తోటలకు ఇన్సూరెన్సు కల్పించాలని ప్రభుత్వానికి విన్నవించిన ప్రభుత్వం స్పందించక పోవడం వలన తోటల పై ఆధారపడి జీవిస్తున్న గిరిజన కుటుంబాలు అనాధలు అవుతున్నారు.ఇప్పటి కైనా ప్రభుత్వం స్పందించి మృతి చెందిన కిల్లో బలరాం కు నష్ట పరిహారం అందించి ఆ కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకోవాలని జాతీయ కాఫీ రైతు సంఘం నాయకులు గెమ్మెలి చిన్న బాబు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

# దళిత, వెనుకబడిన తరగతుల వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న వీసీ



ఎస్సీ కమిషన్ మెంబర్ ని కలిసిన అతిథి అధ్యాకులు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారం):** ఆంధ్ర యూనివర్సిటీలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు ఈరోజు ఎస్సీ కమిషన్ మెంబర్ సీతారాంను జిల్లా పరిషత్ ఫంక్షన్ హాల్ లో కలిసి తమ సమస్యలను వివరించారు. ముఖ్యంగా దళితులు మరియు వెనుకబడిన తరగతులు వారికి జరుగుతున్నటువంటి అన్యాయాన్ని వివరించారు. వేతనాల విషయంలో కనీస వేతనాలు కూడా ఇవ్వటం లేదని ఈ సందర్భంగా ఆయనకి తెలియజేశారు. అదే రకంగా రాష్ట్రంలో ఉన్న ఇతర యూనివర్సిటీలో అమలవుతున్న ఆంధ్ర యూనివర్సిటీలో ఈ వ్యతిరేక విధానాన్ని వీసీ అవలంబించడం చాలా విచారించదగ్గ విషయంగా పరిగణిస్తున్నారు. ఆంధ్ర యూనివర్సిటీ కి త్వరలో పర్యటనకు వచ్చి పరిస్థితిని న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. అతిథి అధ్యాపకులకు . ఒకే రకమైన పోస్టులకు పదేపదే ఇంటర్వ్యూలు కండక్ట్ చేసి దళిత గిరిజన వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు అన్యాయం చేస్తున్నారు. రివ్యూస్ కండక్ట్ చేయాల్సి ఉన్న ఇంటర్వ్యూలు కండక్ట్ చేయటం అధ్యాపకులు సంఘం వ్యతిరేకిస్తుంది. ఈ నిరసన దీక్షలు 32వ రోజుకు చేరిన సందర్భంగా యూనివర్సిటీ అధికారులు సరైనటువంటి విధంగా పట్టించుకోకపోవడం విచారంగా ఉందని తెలియజేశారు . అదే రకంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ప్రజల సమస్యలని పరిష్కరిస్తుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అనేక సందర్భాల్లో తెలియజేశారు కానీ యూనివర్సిటీలో అందుకు వ్యతిరేకంగా చర్యలు ఉన్నాయని ఈ సందర్భంగా ఆయనకి గుర్తు చేశారు. యూనివర్సిటీ కి ఎస్సీ కమిషన్ పర్యటించి సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా కమిషన్ మెంబర్ని రావాడ సీతారామ్ని కోరారు . ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం సురేష్ మీనన్ (అతిథి అధ్యాపకుల అధ్యక్షుడు) పాల్గొన్నారు.

# ఆపదలో ఆదుకునే ఆశాజ్యోతి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ



**తాళ్ళపూడి విశాఖ సమాచారం :ప్రతినిధి (శివకృష్ణ )** గుండె జబ్బుతో బాధ పడుతూ మెడిసిన్, వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్న ప్రక్కిలంక వాసి జుట్టా పద్మావతికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 6 వేల రూపాయలు అంకెం సురేష్ వెయ్యి రూపాయలు, కాలినేని ప్రదీప్ వెయ్యి రూపాయలు కలిపి మొత్తంగా 8 వేల రూపాయల ఆర్థికసాయం అందజేయడమైనదని సంస్థ అధ్యక్షులు వెలుగుబంటి శ్రీనివాస్ తెలిపారు. కష్టాల్లో ఉన్నవారి ఒక్క కన్నీటిబొట్టునైనా తుడవాలన్నదే మానవత ధ్యేయమని అన్నారు. సంస్థ అధిక మొత్తం విద్య, వైద్య సేవల కోసం ఖర్చు పడుతుందని తెలిపారు. వీరవల్లి శివకృష్ణ మాట్లాడుతూ కష్టాల్లోనూ ఆపదలోనూ ఉన్నవారు మానవతను ఆశ్రయిస్తే తగు సహాయం చేస్తామని అన్నారు.సంస్థ ఫౌండర్ రామచంద్రారెడ్డి గారి ఆశయాల మేరకు మానవులకు సేవ చేయడమే సంస్థ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో వెలుగుబంటి శ్రీనివాస్, సనపల రాజశేఖర్, అప్పన వీరహనుమంతురావు, అంకెం సురేష్, పెమ్మాడి దుర్గాప్రసాద్, తైలం పోచారావు, కొప్పాక వెంకటేశ్వరరావు, వీరవల్లి శివకృష్ణ, సొలస గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక శ్రద్ధ పట్ల కొప్పాక జవహర్ కృషికి స్పందించిన అధికారులు



**విశాఖ సమాచారం: ప్రతినిధి (శివ కృష్ణ) :** కొవ్వూరు పట్టణంలోని కొవ్వూరు బస్టాండ్ నుండి నందమూరు, చాగల్లు యువరాజ్ ఫంక్షన్ హాల్ రోడ్డు నిత్యం వాహనాలు, ప్రయాణీకులు తో రద్దీ ఉందంటం జరుగుతుంది. ఆరోడ్డు లో సాయి కల్యాణ మండపం మున్సిపల్ హైస్కూల్, చైతన్య స్కూల్ లు ఉన్నవి. అక్కడ ఈ మధ్య కాలంలో మున్సిపాలిటీ వారు డ్రైనేజీ లు నుండి స్కిల్ట్ తీస్తున్నారు. తీసిన స్కిల్ట్ రోడ్లకు ఇరువైపులా వేసినారు..రోడ్డుపై వేసిన సిల్ట్ వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెదేపా కార్యకర్త కొప్పాక జవహర్ విజయనంద కుమార్ అధికారులకు విన్నవించగా సంబంధిత అధికారులు తీసిన సిల్ట్ ను తరలించే ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. .

# అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాలు



**విశాఖ సమాచారమ్ :** మండల పరిషత్ ప్రాథమిక ప్రధాన పాఠశాల ఉప్పరగూడెం ఆఫ్ గోపాలపురం నందు నేడు ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గంజి మౌనిక వారి అధ్యక్షతన పొట్టి శ్రీరాములు జయంతి ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి అమరజీవి అయిన మహా పురుషుడు, పొట్టి శ్రీరాములు, ఆంధ్రులకు ప్రాంతం, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడైన వాడు, మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కొరకు జీవితాంతం కృషిచేసిన మహనీయుడు అని మౌనిక టీచర్ విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఎం. విజయలక్ష్మి సిఆర్పి కొయ్య నాగరాజు, వంట ఏజెన్సీ నిర్వాహకులు నాగరత్నం, స్కావెంజర్ షేక్ బీబీ, తదితరులు పాల్గొన్నారు

# 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



**తాళ్లపూడి మండలం విశాఖ సమాచారం: ప్రతినిధి (శివ కృష్ణ)** తాడిపూడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ రైతన్నా – మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు గారు. ఈ కార్యక్రమంలో భాగంగా తాడిపూడి గ్రామంలో డోర్ టూ డోర్ పర్యటించారు. ఈ కార్యక్రమంలో టుమెన్ కమిటీ మెంబెర్స్ జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి గారు, కంఠమణి రామకృష్ణ గారు, సిద్దా దుర్గాప్రసాద్ గారు, నామన పరమేష్ గారు, నామా కొండబాబు గారు, చెన్నా సత్యనారాయణ గారు ఇందుగుల రామకృష్ణ గారు, కొటారు వెంకట్రావు గారు, అనపర్తి ప్రసాద్ గారు, కూచిపూడి గణపతి గారు, అన్నమరెడ్డి రమణ గారు, బోడపాటి గంగరాజు గారు మరియు అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ అధికారిణి రుచిత,తదితర చీణూ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు చట్టం కోసం తెలుసుకోవాలి

**కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్సై కిషోర్ వర్మ సూచన**



**కొయ్యురు(విశాఖ సమాచారం):-** ప్రతి ఒక్కరు ముఖ్యంగా యువత చట్టం పట్ల అవగాహన కలిగి ఉండాలని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్సై కిషోర్ వర్మ లు తెలిపారు. మంగళవారం సాయంత్రం కాకరపాడు కూడలి వద్ద ప్రజలతో సమావేశమై చట్టాల గురించి వివరించారు. గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాహనాలు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా నడపాలని మితిమీరిన వేగం చట్ట విరుద్ధమని, ప్రతి ఒక్క వాహనదారుడు లైసెన్సులు కలిగి ఉండాలని అన్నారు. సైబర్ నేరాలు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా యువత సమాజం పట్ల అంకితభావంతో ఉండాలని పోలీసు చట్టాలను తెలుసుకొని గౌరవించాలని సన్మార్గంలో నడవాలని యువతను కోరారు. మత్తు పదార్థాలు, గంజాయి ఎవరైనా కలిగివున్న, రవాణా చేస్తున్న తమకు సమాచారం ఇవ్వాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# గిరిజన గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలపై అవగాహన

**ఎయిమ్స్ న్యూఢిల్లీ ఎక్సిస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శిక్షణ**



**జి.కె. వీధి,(విశాఖ సమాచారం):-** అల్లూరి సీతారామరాజు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, జి.కె. వీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్చి) పరిధిలోని రింతాడ-1, రింతాడ-2 మరియు దమనపల్లి సచివాలయాల పరిధిలో మంగళవారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎయిమ్స్ న్యూఢిల్లీ ఎక్సిస్ హెచ్ డబ్ల్యు సి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు, ఎ ఎన్ ఎం లు, ఎమ్మెల్పి హెచ్ లకు గ్రామ ఆరోగ్యం, పారిశుధ్యం, పోషకాహారం మరియు ప్రభుత్వ వైద్య సేవలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ ప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ప్రతి ఇంటికి చేరేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రజలకు 12 రకాల వైద్య సేవలు, 14 రకాల పరీక్షలు, 105 రకాల ఉచిత మందుల లభ్యతపై అవగాహన కల్పించాలని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో టీబీ (క్షయ) వ్యాధి నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. క్రమం తప్పకుండా మందులు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడంతో పాటు, టీబీ రోగులకు ప్రభుత్వం అందిస్తున్న నగదు ప్రోత్సాహకాలను ప్రజలకు తెలియజేయాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. తల్లీ బిడ్డల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతి నెలా రెండుసార్లు నిర్వహించే గ్రామ ఆరోగ్య, పోషకాహార దినోత్సవం (వి ఎచ్ ఎన్ డి) కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలు మరియు చిన్నారులకు టీకాలు, ఆరోగ్య సేవలు అందేలా చూడాలని సూచించారు. అలాగే ఆసుపత్రి కాన్పులను ప్రోత్సహించే జనని సురక్ష యోజన (జె ఎస్ వై) పథకం మరియు కాన్పు అనంతరం తల్లి-బిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చే సేవలపై అవగాహన పెంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ సభ్యులు శ్రీనివాస్, రాజు, తేజ, జి.కె. వీధి పీహెచ్ సి హెల్త్ విజిటర్ ఎర్రయమ్మ, హెల్త్ అసిస్టెంట్ ఎం. సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే ఎం ఎల్ హెచ్ పి లు నిర్మల, మధులత, లింగేశ్వరి, ఎఎన్ఎం లు యోగిత, పద్మ, మంగలక్ష్మి, పోలమ్మ, దేవి, ప్రవళిక మరియు పెద్ద సంఖ్యలో ఆశా కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జి.కె. వీధిలో ఘనంగా 'రైతన్న మీకోసం' కార్యక్రమం

**రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం**



**జి.కె. వీధి (విశాఖ సమాచారం):-** జి.కె. వీధి మండల కేంద్రంలో తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ (టి.ఎన్.ఎస్.ఫ్) ఆధ్వర్యంలో 'రైతన్న మీకోసం' అనే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ నాయకులు పాల్గొని రైతుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. రైతులకు అన్ని విధాలా అండగా నిలవడమే తమ ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని స్పష్టం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేయడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ముక్కలి కల్యాణి ఉ జిల్లా టి.ఎన్.ఎస్.ఫ్ కార్యదర్శి,పొత్తూరు కొండల రావు జి.కె. వీధి మండల టి.డి.పి అధ్యక్షులు,తాకురి శ్రీధర్ జి.కె. వీధి మండల బి.జె.పి అధ్యక్షులు,సిరిబాల బుజ్జిబాబు దేవరాపల్లి పంచాయతీ సర్పంచ్,పనసల జోగిబాబు మాజీ బి.జె.పి మండల అధ్యక్షులు,ఎం వి.వి.ఎస్ ప్రసాద్ టి.డి.పి నాయకులు,మెట్టడం రామకృష్ణ టి.డి.పి నాయకులు,శ్రీనివాస్ టి.డి.పి ఉపాధ్యక్షులు, దేవరాపల్లి ఉపసర్పంచ్,జి. రాజు ఉ సీనియర్ నాయకులు,ముక్కలి మహేష్.ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన రైతులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మున్సిపల్ చైర్ పర్సన్ మరియు పాలకవర్గ సభ్యులకు వీడ్కోలు



కార్యక్రమానికి మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

**సాలూరు విశాఖ సమాచారం:** సాలూరు మున్సిపల్ చైర్పర్సన్ మరియు పాలకవర్గ సభ్యులకు మున్సిపల్ కమిషనర్ టి రత్నకుమారు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం వీడ్కోలు సమావేశము ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా కమిషనర్ టి రత్నకుమార్ మాట్లాడుతూ ఐదేళ్ల కాలం కౌన్సిలర్లు చైర్పర్సన్ సహాయ సహకారముతో సాలూరు మున్సిపాలిటీ అభివృద్ధి పదములో నడిపించామని అన్నారు అందరి సహాయ సహకారాలతో అభివృద్ధి చేశామని అన్నారు. చైర్ పర్సన్ మువ్వల ఈశ్వరమ్మ మరియు వైస్ చైర్ పర్సన్స్ వంగపండు అప్పలనాయుడు జర్జాపు దీపిక సాలువులతో చిరు సన్మానము చేయడం జరిగింది అనంతరం కౌన్సిలర్ కు సన్మానించారు సన్మాన అనంతరము విందు ఏర్పాటు చేసి వీడ్కోలు పలికారు ఈ

# యువతి అదృశ్యమైన ఘటనను చేదించిన పోలీసులు



**విశాఖ సమాచారం :** తెలంగాణ రాష్ట్రంలో ఓ యువతి అదృశ్యమైన ఘటనను విశాఖ టూటౌన్ పోలీసులు చేదించారు. దీనితో విశాఖ పోలీసుల సేవలను తెలంగాణ పోలీసులు కొనియాడారు. వివరాల్లోకి వెళితే నిర్మల్ జిల్లా, ఖానాపూర్ అంబేద్కర్ కాలనీలోని నివాసముంటున్న చిట్యాల శ్రావణి (26) ఫిబ్రవరి 14న షాపింగ్ కు వెళ్తానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు చుట్టు ప్రక్కల గాలించిన ఫలితం లేకపోవడంతో ఖానాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. శ్రావణి విశాఖపట్నం జిల్లాలో ఉన్నట్టు అనుమానపడ్డ పోలీసులు మూడు రోజుల క్రితం ఇక్కడకు చేరుకున్నప్పటికీ ఏ ప్రాంతంలోని ఉందో తెలియరాలేదు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టూటౌన్ సీఐ వీవీసీఎం ఆధ్వర్యంలో పోలీసులు మానవ, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా డాబాగార్డెన్స్ లోని ఉన్నట్టు గుర్తించారు. మంగళవారం సీఐ సూచనల మేరకు తెలంగాణ పోలీసులు, టూటౌన్ కానిస్టేబుల్ నారాయణరావు రెండు బృందాలుగా ఏర్పడి శ్రావణి ఆచూకీ కనుగోన్నారు. అనంతరం సీఐ ఎర్రం నాయుడు కౌన్సిలింగ్ లో శ్రావణి ఓ యువకుడిని ప్రేమ వివాహం చేసుకొని ఇక్కడకు స్థిరపడడానికి వచ్చినట్టు తెలుసుకున్నారు. పిల్లల పెళ్లిళ్ల విషయంలో తల్లిదండ్రులు వారి అభిప్రాయాలకు, ఇష్టాలకు ప్రాధాన్యత ఇస్తూ, వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించాలని సీఐ సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ 01 విజయ్ మణికంఠ, ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి సీఐ, కానిస్టేబుల్ కు అభినందనలు తెలిపారు. యువతి తల్లిదండ్రులు సీఐ, కానిస్టేబుల్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఊబి లో కూరుకుపోయిన గేదను రక్షించిన అగ్నిమాపక శాఖ



**మచిలీపట్నం, విశాఖ సమాచారం(ఆర్ ఎన్ ఐ ) :** ఈరోజు మంగళవారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో మచిలీపట్నం హౌసింగ్ బోర్డు నుండి చిట్టిపాలెం వెళ్లే రోడ్ ప్రక్కన(సత్యా కన్వెన్షన్ హాల్ ఎదురుగా )లోతైన కాలువలో లక్ష రూపాయల విలువైన గేద చిక్కుపోయింది. రహదారిపై వెళ్లేవారు ఎంత ప్రయత్నించినా బయటకి తీయలేకపోవటంతో ఆఖరికి అగ్ని మాపక సిబ్బంది వచ్చి అతిప్రయాస పై బయటకుతీశారు. జర్నలిస్టులకు ఇండ్లస్థలాల పంపిణీకి తొలినమెరక తోలిన మరోప్రక్క రోడ్ కి మధ్య ఏర్పడిన కాలువ తవ్వటంతో చాలా లోతున్నందువలన గేద ఇరుక్కుపోయిందని అగ్ని మాపకశాఖ ప్రతినిధి సంఘటనా స్థలంలో ఆర్ ఎన్ ఐ ప్రతినిధికి తెలిపారు. కాగా ఎంతో కాలంగా స్థానిక పాత్రికేయులు ఇల్లస్థలాలకోసం ఎదురు చూస్తున్నప్పటికి ఆ సమస్య అలాగే ఉండగా, స్థానికులు ఐన రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర చొరవతో షుమారు 40 మందికి పైగా ఇల్ల స్థలాలు ఇచ్చేందుకు అవసరమైన మెరక పనులు (ఫొటోలో చూడవచ్చు) చురుకుగా జరుగుతున్నాయి. ఇప్పటికే నవీనమిట్టల్ కాలనిలో కొందరు ఇల్లాస్థలాలు పొందటం కలిగింది. మిగిలిన వారికి మంత్రి కొల్లు రవీంద్ర ఔదార్యంతో స్థలాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం అవటం హర్షనీయం. ఇలాగే ప్రతి నియోజక వర్గంలో ఆయా మంత్రులు, శాసనసభ్యులు చొరవతీసుకుని ప్రభుత్వ భూమి ని పాత్రికేయులకు పంపిణీ చేస్తే దీర్ఘకాలంగా రాష్ట్రంలోఉన్న జర్నలిస్టుల స్థలాలు సమస్య పరిష్కారం అవుతుందనుటలో సందేహంలేదు.

## రూ.10 కోట్లతో అల్లూరి సీతారామరాజు పార్క్ ప్రారంభించిన మంత్రి నారాయణ, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు



- పల్లగాజువాక కాలుష్యం పై పల్లా ఉక్కుపాదం
- డంపింగ్ యార్డ్ రహిత గాజువాక దిశగా అడుగులు
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారం):-** గాజువాకలో మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ పర్యటన సందర్భంగా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే శ్రీ పల్లా శ్రీనివాసరావుతో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 76వ వార్డు ఏపీ హౌసింగ్ బోర్డు కాలనీలో రూ.10 కోట్లతో నిర్మించిన అల్లూరి సీతారామరాజు పార్కును ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడిన పల్లా శ్రీనివాసరావు, గాజువాకలో కాలుష్య సమస్యను పూర్తిగా నిర్మూలించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. గాజువాకను పూర్తిగా డంపింగ్ యార్డ్ రహిత ప్రాంతంగా మార్చి 'పొల్యూషన్ ఫ్రీ గాజువాక'గా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడించారు. మంత్రి పి. నారాయణ గారి పనితీరును పల్లా ప్రశంసించారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ వ్యవస్థను పునరుద్ధరించి, నగరాభివృద్ధికి వేగం తీసుకొస్తున్న మంత్రి నారాయణ గారి కృషి అభినందనీయమన్నారు. తాగునీరు, డ్రైనేజీ, మౌలిక వసతుల అభివృద్ధిలో ఆయన చూపుతున్న చొరవ వల్లే నగరాలు కొత్త రూపం దాలుస్తున్నాయని కొనియాడారు. గాజువాక అభివృద్ధికి కూడా మంత్రి నారాయణ గారి ప్రత్యేక దృష్టి ఉండటం స్థానిక ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని పల్లా తెలిపారు. కాలుష్యంపై కఠిన చర్యలు:-గాజువాక, అగనంపూడి, పెందుర్తి ప్రాంతాల నుంచి రోజుకు సుమారు 450 టన్నుల ఘన వ్యర్థాలు డంపింగ్ యార్డ్‌కు చేరుతున్నాయని పల్లా తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఆధునిక విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు. నగరంలోని పలు ప్రాంతాల్లో కంపాక్టర్లు ఏర్పాటు చేసి, ఒక్కో కంపాక్టర్ ద్వారా సుమారు 33 టన్నుల వ్యర్థాలను నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు ఏర్పాటు చేసి చెత్త నిల్వ లేకుండా వెంటనే తరలించే విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. “డంపింగ్ యార్డ్ లేకుండా గాజువాకను తీర్చిదిద్దుతాం” అని పల్లా స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్న 8 ఎంఎస్ కంటైనర్లను 30కి పెంచి, చెత్త నిల్వ లేకుండా నిరంతరంగా తరలించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. 76వ వార్డు రామచంద్రనగర్ డంపింగ్ యార్డ్‌ను సందర్శించి స్థానికులతో మాట్లాడిన పల్లా, సమస్యను త్వరలోనే పూర్తిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి దిశ:-రాష్ట్రాన్ని 'మిషన్ వరల్డ్'గా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పల్లా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి కోసం రూ.15 వేల కోట్లతో ప్రాజెక్టులు చేపడుతున్నామని, డ్రైనేజీ పనులకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.4 వేల కోట్లు కేటాయించి మున్సిపాలిటీల్లో తాగునీరు, డ్రైనేజీ, స్ట్రీట్ లైటింగ్ పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. గాజువాకలోనే రూ.223 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. 74వ వార్డు దయాల్ నగర్ కొండను హిల్ టాప్ పార్క్‌గా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

మున్సిపల్ నిధుల వినియోగంలో పారదర్శకత:-గత వైసీపీ ప్రభుత్వం మున్సిపల్ నిధులను దారి మళ్లించి అభివృద్ధిని అడ్డుకుందని పల్లా విమర్శించారు. ఏప్రిల్ 1 నుంచి ప్రతి మున్సిపాలిటీ నిధులను అదే మున్సిపాలిటీలో ఖర్చు చేయాలని ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజలు చెల్లించిన పన్నులు ప్రజల అభివృద్ధికే వినియోగించేలా గ్రీన్ ఛానల్ విధానం అమలు చేస్తున్నామని చెప్పారు.ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు, పక్కా డ్రైనేజీ వ్యవస్థలు, వీధి దీపాలు, మెరుగైన రహదారులు కల్పించడమే కూటమి ప్రభుత్వ సంకల్పమని పల్లా తెలిపారు. విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టుపై కూడా కేంద్రంతో చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

